

ఎకో సెన్సిటివ్ జోన్ మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 29(ఆంధ్రజ్యోతి): నేలపట్టులోని పక్షి అభయారణ్యానికి సంబంధించి ఏకో సెన్సిటివ్ జోన్ జోనల్ మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఈ అంశంపై అధికారులతో ఆయన సమీక్షించారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యం సాధించడానికి శాఖల సమన్వయం అవసరమన్నారు. ఈ ప్రక్రియలో ప్రజల జీవనోపాధి, భద్రత, ప్రకృతిపరిరక్షణ ముఖ్యమైనవన్నారు. అటవీ సంరక్షణాధికారి సెల్వ మాట్లాడుతూ జోనల్ మాస్టర్‌ప్లాన్ పర్యావరణ పరిరక్షణకు, స్థానిక అభివృద్ధికి మార్గదర్శకంగా నిలవాలన్నారు. సమీక్షలో జేసీ శుభం బన్సల్, ఐఎఫ్ఎస్ డీఎఫ్‌వో వివేక్, డివిజనల్ ఫారెస్టు అధికారిణి హారిక తదితరులు పాల్గొన్నారు.



నేడే నింగిలోకి నిసార్

- 8లో

సమయం: సాయంత్రం 5.40 గంటలు
రూపకల్పన: ఇస్రో- నాసా సంయుక్తంగా..
ఉద్దేశం: భూఉపరితల పరిశీలన, వాతావరణ మార్పుల అధ్యయనం
రాకెట్: జీఎస్ఎల్‌వీ- ఎఫ్16

అదిగదిగో ఏనుగులు

- శ్రీవారి మెట్టు మార్గాన హల్‌చల్
- పంటల ధ్వంసం
- డ్రోన్ ద్వారా గుర్తించి అప్రమత్తం చేసిన అధికారులు
- గంటన్నర ఆలస్యంగా భక్తులకు అనుమతి

- 8లో



వైభవంగా గరుడ వాహనసేవ



గరుడపంచమి సందర్భంగా మంగళవారం తిరుమలలో గరుడవాహనసేవ వైభవంగా జరిగింది. మలయప్పస్వామి విశేష అలంకరణలో తన ఇష్టవాహనమైన గరుడునిపై కొలువుదీరి మాడవీధుల్లో విహరించారు. భక్తులకు దర్శనమిచ్చారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, భక్తుల కర్పూర హారతులు, గోవిందనామస్మరణల మధ్య స్వామి ఊరేగారు. వాహనసేవలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అయ్యో.. నే బతికే ఉండా


రేషన్‌కార్డులో జైనాబీ పేరుతో ఉన్న జమృతాబీ

కేవీబీపురం తహసీల్దారు కార్యాలయం వద్ద దీనంగా నిలబడి ఉన్న ఈమె పేరు జమృతాబీ. వయసు 55 ఏళ్లు. ఓళూరు గ్రామం. ఆమె ఆధార్ నెంబరును కంప్యూటరులో ఎంట్రీ చేస్తే.. చనిపోయినట్లు చూపుతోంది. దీంతో రేషన్ కార్డు పోయింది. పింఛనూ రావడం లేదు. సారూ, నేను బతికే ఉన్నానంటూ నాలుగేళ్లుగా ఆమె కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వాళ్లు లేరు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పొరబాటు ఈమెను ముప్పుతిప్పలు పెట్టిస్తోంది. వీరి కుటుంబ రేషన్ కార్డులో యజమానురాలుగా జమృతాబీ ఫొటో ఉంది. ఈమె అత్త జైనాబీ పేరు పెట్టారు. నాలుగేళ్ల కిందట జైనాబీ మృతిచెందారు. అప్పట్లో జైనాబీ పేరుకు జమృతాబీ ఆధార్‌ను లింక్ చేసి చనిపోయినట్లు రికార్డుల్లోకి ఎక్కించారు. అప్పట్నుంచి తాను బతికే ఉన్నానని చెప్పుకొనేందుకే జమృతాబీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రేషన్‌కార్డు అడుగుతున్నారు. పింఛను వస్తే తన జీవితం గడిచిపోతుందని ఆమె ఆశ. గత నెల 24వ తేదీన తిరుపతిలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలోనూ ఆమె తన పరిస్థితి వివరిస్తూ ఉన్నతాధికారులకు అర్జీ ఇచ్చారు. 'భర్త లేదు. ఏ అండాలేని తనకు రేషన్‌కార్డు, పింఛు ఇచ్చి ఆదుకోండి' అంటూ మొర పెట్టుకున్నారు. సమస్యను పరిష్కరించి కార్డు ఇప్పించండంటూ కలెక్టరేట్ నుంచి మండల అధికారులకు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదు. మళ్లీ ఈ నెల14న ఆమె కలెక్టరేట్‌కు వెళ్లి అర్జీ ఇచ్చారు. మంగళవారం నాటికంతా సమస్యను పరిష్కరించి న్యాయం చేస్తామని చెప్పారు. మంగళవారం వచ్చింది. వీఆర్వో వచ్చి సమస్యను పరిష్కరించామంటూ ఆమె వద్ద సంతకం తీసుకున్నారు. కానీ సమస్య పరిష్కారం కాలేదు. మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఆమె తన గోడు వెల్లబోసుకున్నారు.


తహసీల్దారు కార్యాలయం వద్ద జమృతాబీ

- కేవీబీపురం, ఆంధ్రజ్యోతి

చంద్రగిరి

పేదల సమస్యలు పట్టని ప్రభుత్వాలు : సీపీఐ


మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

పాకాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారం చేపట్టిన ప్రభుత్వాలకు అధికారంకోసం ఆరాటం తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా నాయకులు చంద్రశేర్ రెడ్డి, శ్రీరాములు విమర్శించారు. స్థానిక వారపుసంత ఆవరణలో మంగళవారం ఆ పార్టీ కార్యదర్శి ప్రకాష్ అధ్యక్షతన మండల మహాసభ నిర్వహించారు. జిల్లా నాయకులు మాట్లాడుతూ దున్నేవాడికి భూమి, ఇల్లులేని పేదలకు ఇళ్లస్థలాలు, కార్మిక చట్టాల అమలు, లేబర్ కోడ్‌ల రద్దు, కార్మికులకు కనీసం వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చడంలేదన్నారు. విద్యుత్ చార్జీలు పెంచడానికి స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు షబ్బీర్, డిల్లీ షేక్‌లాల్, హైమావతి, నాగరాజు, రహీం, లోకాసింగ్, అన్నయ్య, సురేష్, కేశవులు, వహీదా పాల్గొన్నారు.

ఘనంగా బీటీఏ ఆవిర్భావ దినోత్సవం


ఆవిర్భావ దినోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

పాకాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్వీఎన్ పాఠశాలలో జరిగిన సమావేశానికి బీటీఏ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కె రామచంద్రయ్య అధ్యక్షత వహించారు. జిల్లాలో బీటీఏ వ్యవస్థాపకుడు జి.ఆంజినేయులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వం, ఇప్పటి ప్రభుత్వం దాటవేట దోరణి కొనసాగిస్తున్నాయన్నారు. బీటీఏ జిల్లా కార్యదర్శి పి.రామమూర్తి, నాయకులు కృష్ణమూర్తి, జ్యోతి, విజయమోహన్, రాజేంద్రుడు, సుబ్బయ్య, పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు అభినందన



పాకాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్యాంపులో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్, అధ్యాపకులు అభినందించారు. సికింద్రాబాద్‌లో జరిగిన ఆర్మీ అటాచ్‌మెంట్ జాతీయ క్యాంపులో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులు హరిబాబు, అభిషేక్, కుశల్‌కుమార్, రెడ్డిప్రవీణ్‌లను మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మాశిలామణి, ఎన్‌సీసీ అధికారి ఈశ్వరబాబు, రమణమ్మ, చిట్టికళావతి పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు


వైద్య శిబిరానికి హాజరైన వైద్యులు,సిబ్బంది

భాకరాపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ ఆధ్వర్యంలో మంగళవారం భాకరాపేటలో మహిళలకు ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. స్విమ్స్ పింక్ బస్సు యాత్రలో భాగంగా మహిళలకు నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వారం క్యాన్సర్ల నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో భాకరాపేట పీహెచ్‌సీ వైద్యాధికారి హేమంత్ కుమార్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ హరిత, సీహెచ్‌వో శేషుకుమారి, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కబడ్డీ స్వర్ణ పతక విజేతలకు అభినందన


కబడ్డీ విజేతలతో స్కూల్ యాజమాన్య ప్రతినిధులు

రామచంద్రాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-17 పోటీల్లో స్వర్ణపతకం సాధించిన రామాపురం వెరిటాస్‌సైనిక్ స్కూల్ విద్యార్థులను అభినందించారు. .ఈ సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శేషారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 24నుంచి 26వతేదీ వరకు తెలంగాణలో ఉమ్మడి తెలుగు ఒరాష్ట్రాల కబడ్డీ పోటీలు జరిగాయన్నారు. 94 జట్లు పాల్గొన్న పోటీల్లో విద్యాపీఠం పాఠశాల(తెలంగాణ) జట్టుపై తమపాఠశాల విద్యార్థులు గెలుపొంది స్వర్ణపతకం సాధించారన్నారు. సెప్టెంబరు 13 నుంచి బిహార్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. కబడ్డీ కోచ్‌లునరేష్, శంకర్‌తో పాటు విజేతలను పాఠశాల డీన్ ఖాన్, ప్రిన్సిపాల్ నాగార్జున, డైరెక్టర్ శ్రీకర్‌రెడ్డి అభినందించారు.

చెరువుకాడఇండ్లలో టీడీపీ ప్రచారం


కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుపల్లి పంచాయతీ చెరువుకాడ ఇండ్లు గ్రామంలో సుపరిపాలనలో మంగళవారం టీడీపీ నాయకులు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.మంగళవారం మాజీ ఎంపీపీ బిందుమాధవి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో విజయకుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, దేవరాజులు, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఫల్గుణ యాదవ్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వారాహి హోమం



రామచంద్రాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): శక్తిపీఠంలో గరుడ పంచమి సందర్భంగా మంగళవారం వారాహి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠంలో మరకతశక్తి కాళీ అమ్మవారితో పాటు వారాహి అమ్మవారికి తిరుమంజనానంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం 9గంటలకు వేదపండితులు వారహి హోమాన్ని ప్రారంభించగా మధ్యాహ్నం 12గంటలకు శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి హోమాన్ని పూర్ణాహుతితో ముగించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పండితులు ఊంజల్‌సేవ నిర్వహించారు.

ప్లేస్‌మెంట్‌పై ముందస్తు అవగాహన


ప్రీ ప్లేస్‌మెంట్ సెషన్‌లో సూచనలిస్తున్న నిపుణుడు

చంద్రగిరి, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో మంగళవారం ప్రీ ప్లేస్‌మెంట్ సెషన్ నిర్వహించారు. బీటెక్ చివరి సంవత్సర విద్యార్థులకు ఈసెషన్ దోహద పడుతుందని వర్సిటీ వర్గాలు తెలిపాయి. గ్లోబల్ డెలివరి సంస్థ భాగస్వామి రాఘవేంద్ర కులకర్ణి మాట్లాడుతూ ఐటీలో కొత్త ట్రెండ్‌లు, నియామక ప్రక్రియల తీరు, సేల్స్‌ఫోర్స్ సర్వీసెస్, జావా వంటి ప్లాట్‌ఫామ్‌లలో నైపుణ్యాలకు పెరుగుతున్న డిమాండ్ గురించి వివరించారు. హెచ్‌ఆర్ సీనియర్ మేనేజర్ జితేందర్ సింగ్ తన ప్రసంగంలో జేన్‌సీ ప్రోగ్రామ్‌కు సంబంధించిన మెలకువలను వివరించారు. ప్రతిభను ప్రోత్సహించడంలో కాగ్నిజెంట్ అకింతభావంతో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంబీయూ వైస్‌ఛాన్సలర్ నాగరాజ్ రామారావ్, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డిల్లీబాబు, తదితరులు పాల్గొన్నారు.

పులివర్తి లక్ష్మీభారతికి మంత్రి రవీంద్ర నివాళి



పాకాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పులివర్తి నాని మాతృమూర్తి పులివర్తి లక్ష్మీభారతికి రాష్ట్ర గనులు, భూగర్భశాఖ మంత్రి కొల్లు రవీంద్ర నివాళులు అర్పించారు. మంగళవారం ఉదయం పులివర్తివారిపల్లెకు చేరుకున్న ఆయన లక్ష్మీభారతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వైభవంగా గంగమ్మ జాతర


అంకాలమ్మ త్రిశూలాన్ని ఊరేగిస్తున్న భక్తులు

చంద్రగిరి, జూలై 29(ఆంధ్రజ్యోతి): నరసింగాపురం హరిజనవాడలో మంగళవారం గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. జాతర సందర్భంగా రాత్రి అంకాలమ్మ త్రిశూలాన్ని వేడుకగా నిర్వహించారు. విశేషంగా అలంకరించిన గంగమ్మ ప్రతిమకు ఉదయం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్ళు పెట్టి, మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారి త్రిశూలాన్ని ఊరేగించారు. టీడీపీ నాయకులు రమేష్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, వెంకటమునిరెడ్డి, శ్రీను, కన్నయ్య, వేణుగోపాల్, వంశీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో మంత్రి దుర్గేష్


మంత్రి దుర్గేష్‌ను సన్మానిస్తున్న జనార్దన్‌రెడ్డి

తిరుచానూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం దర్శించుకున్నారు. అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మంత్రికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపుల జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, ఆర్డీ రమణప్రసాద్ మంత్రిని దుశ్శాలువాతో సన్మానించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

తడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. మండల పరిధిలోని బీవీపాళెం దళితవాడకు చెందిన విఘ్నేష్(29) ఇంట్లో మంగళవారం రాత్రి విద్యుత్ సరఫరా ఆగిపోయింది. సమీపంలో విద్యుత్ స్తంభానికి ఉన్న వైర్లను పొడవాటి కర్రతో కదిలించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతం జరగడంతో స్పృహ తప్పిపడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


మృతి చెందిన వెంకటకృష్ణయ్య

ఓజిలి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం రావిపాడు గ్రామానికి చెందిన ఆళ్లకుంట వెంకట కృష్ణయ్య(55) గ్రామానికి సమీపంలోని చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. వెంకట కృష్ణయ్య ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం చెరువులో వెంకట కృష్ణయ్య మృతదేహాన్ని గమనించిన స్థానికులు బంధువులకు తెలియజేశారు. వారి సమాచారంతో ఎస్‌ఐ శ్రీకాంత్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ముక్కంటి సేవలో ఇస్రో చైర్మన్


ఇస్రో చైర్మన్ నారాయణన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, జూలై 29(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వస్వామిని మంగళవారం ఇస్రో చైర్మన్ నారాయణన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. బుధవారం నాసా, ఇస్రో సంయుక్తంగా ప్రయోగించే నిసార్ శాటిలైట్ ఉపగ్రహం ప్రయోగం విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు చేశారు. మృత్యుంజస్వామి సన్నిధి వద్ద వేద పండితులు ఆశీర్వదించి జ్ఞాపిక అందజేశారు.

ఎల్లమ్మ తల్లికి పొంగళ్లు

రేణిగుంట జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సంతగేటు వద్ద ఎల్లమ్మ తల్లి ఆలయ జాతర సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు మంగళవారం పొంగళ్లు సమర్పించారు. ఉదయం అభిషేకాలు నిర్వహించాక భక్తులకు దర్శనం కల్పించారు. ఏలుమలై రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

గుంతలు ఇలా..వెళ్లేదెలా?


వాహనచోదకులకు నిత్యం ఈ మార్గంలో ఇబ్బందులే

తిరుపతి రూరల్,జూలై29(ఆంధ్రజ్యోతి): చిగురువాడ వద్ద స్వర్ణముఖినది వంతెనపై రహదారి గుంతలమయంగా తయారైంది. నాలుగేళ్ల క్రితం వంతెనపై బీటీ రోడ్డును నిర్మించారు. రోడ్డు పొడవునా కంకరతేలిపోయి గుంతలు ఏర్పడ్డాయి. వేదాంతపురం సర్కిల్‌లోని జాతీయ రహదారి నుంచి అర్వీపురం మీదుగా పచ్చికాపల్లం వైపు వేళ్లే ఈమార్గంలో పలుగ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వీరితో పాటు తిరుపతికి వచ్చే యాత్రికులు కూడా ఈదారిలో ఇబ్బంది పడుతున్నారు. భారీ స్థాయి టిప్పర్లు రాకపోకలు సాగిస్తుండటంతో వంతెనపై రహదారి తరచూ అధ్వానంగా తయారవుతోంది. మీడియాలో కథనాలు రావడంతో ఎమ్మెల్యే నానీ చొరవచూపి ఇటీవల తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. వంతెనపై ప్రయాణించే సమయంలో ద్విచక్ర వాహనదారులు ఏమాత్రం పట్టుతప్పినా ప్రమాదాలకు గురికాక తప్పదు. పలువురు ప్రమాదానికి గురైన సందర్భాలు కూడా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. గత వైసీపీ హయాంలో తాత్కాలిక పనులతో చేతులు దులుపేసుకున్నారు. వర్షాలు కురుస్తుండడంతో వంతెనపై ప్రయాణం మరింత ఇబ్బందికరంగా మారనుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాలకులు స్పందించి శాశ్వతపనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వైసీపీ నేతల ఆరోపణలు అవాస్తవాలు: టీడీపీ


మాట్లాడుతున్న బెల్లంకొండ మురళీ, తదితరులు

భాకరాపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): తమ పార్టీ నేతలపై వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలని టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ ఖండించారు. చిన్నగొట్టిగల్లులో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దారి, భూమి, వ్యక్తిగత సమస్యల కారణంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి కేసు నమోదుయితే వాటిని టీడీపీకి అంటగట్టడం సరికాదన్నారు. చినిగేపల్లెకు పొలం తగాదాలో గాయపడిన టీడీపీ కార్యకర్త భరత్‌రెడి ఫిర్యాదు చేయగా నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. మారసానివారిపల్లెకు చెందిన జయమ్మ కోర్టు, రెవెన్యూ అధికారుల ఆదేశాలతో చింత చెట్టును తొలగిస్తే ఆమెపై దాడి జరిగిందన్నారు. ఆమె ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఇది ఉదాహరణలు మాత్రమేనన్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని హింసను, రౌడీయిజాన్ని ప్రోత్సహించరన్నారు. నాయకులు శివకుమార్, మదనమోహన్,ఆర్వీ రమణారెడ్డి, సుబ్రహ్మణ్యం, మునస్వామినాయుడు, చంద్రశేఖర్, మల్లిఖార్జున రెడ్డి, ప్రతాప్ రెడ్డి, హైదర్‌వలీ, బెల్లంకొండ రమణ, రాజగోపాల్ నాయుడు పాల్గొన్నారు.

పంట బీమా నమోదు చేసుకోండి


పొలంబడి కార్యక్రమంలో వ్యవసాయశాఖాధికారులు

రామచంద్రాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరూ పంటలు బీమా నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీదేవి సూచించారు. మంగళవారం కుప్పం బాదూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఏ పంట వేసినా గ్రామ వ్యవసాయ సహాయకులతో వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి మమత, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నెల్లూరు డ్రైవర్ మృతి


సునీల్(ఫైల్‌ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), జూలై 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఆర్‌సీ పురం జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరుకు చెందిన డ్రైవర్ మృతి చెందాడు. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు... నెల్లూరు జిల్లా కలిగిరి మండలం పెద్దకొండూరు గ్రామానికి చెందిన డి.సునీల్ తిరుపతిలో ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన స్నేహితుడు మదన్‌తో కలసి ధనలక్ష్మీనగర్‌లో ఉంటున్న సునీల్ మంగళవారం తెల్లవారుఝామున ద్విచక్ర వాహనంపై ఆర్‌సీ పురం జంక్షన్ నుంచి తిరుపతిలోని జుడియో షాపుకు వెళుతున్నాడు. అదే సమయంలో పాకాలకు చెందిన రమేష్ బాబు మోటర్‌సైకిల్‌పై రాంగ్ రూట్‌లో అతి వేగంగా వచ్చి సునీల్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్నాడు. ఈ ఘటనలో సునీల్ తీవ్రంగా గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై బాధితుడి తండ్రి బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఏపీ బ్రాండ్ ఇమేజ్ కోసం సీఎం సింగపూర్ టూర్

● విజయవంతం కావాలని కోరా: మంత్రి దుర్గేష్



తిరుమల, జూలై29(ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు సింగపూర్‌లో సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న పర్యటన విజయవంతం కావాలని శ్రీవారిని కోరుకున్నట్టు పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో గత ప్రభుత్వంలో ఏపీ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసిందన్నారు. రావాలంటే భయపడుతున్న పారిశ్రామికవేత్తల్లో నమ్మకాన్ని కలిగించేందుకు సీఎం చేస్తున్న ప్రయత్నానికి శ్రీవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నానన్నారు. పదిరోజుల్లో రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సంబంధించి పర్యాటక సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి కార్యచరణ రూపొందించామన్నారు.

8 ఎర్రచందనం దుంగల స్వాధీనం


నిందితులు,దుంగలతో ఫారెస్ట్ అధికారులు

ఎర్రావారిపాలెం జూలై 29, (ఆంధ్రజ్యోతి): తలకోన అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం ఎర్రచందనం దుంగలను తరలించేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురిని ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. బాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ కథనం మేరకు వివరాలిలా. తలకోన సెంట్రల్ బీట్ పరిధిలో మంగళవారం వేకువజామున కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను కారులో లోడ్ చేస్తున్నారని ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందింది. వారు అప్రమత్తమై మెరుపు దాడి చేసి ముగ్గురు స్మగ్లర్లను పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో షేక్ మునీర్ బాషా (దండుపాళ్యం), పాల రామ్మోహన్(బండివారిపల్లి),మక్కల జమీర్ అలియాస్ బత్తల రాజు(మాసాపేట)లు పట్టుబడ్డారు. ఎనిమిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

ఆర్‌టీఐ చట్టం ప్రజలకు ఆయుధం


సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్

చంద్రగిరి, జూలై 29(ఆంధ్రజ్యోతి): సమాచార చట్టం హక్కు చట్టం(ఆర్‌టీఐ) ప్రజలకు ఆయుధంలాంటిదని ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ శేఖర్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి ఆర్‌టీఐ చట్టంపై అవగాహన కల్పించారు. ఆర్‌టీఐ చట్టం ద్వారా ప్రజలు అడిగిన సమాచారం సకాలంలో అందివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


ద్వారకా తిరుమలరావు

తిరుమల, జూలై29(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఎమ్మెల్యే మాధవి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

రేపు సబ్‌జూనియర్ జూడో ఎంపిక పోటీలు

తిరుపతి(క్రీడలు), జూలై 29(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయంలో గురువారం సబ్‌జూనియర్ బాలబాలికల జూడో ఎంపిక పోటీలు జరగనున్నాయని జూడో సంఘం జిల్లా అధక్షులు కృష్ణమూర్తి సోమవారం పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కోచ్ గోపిని 90596 06346 నెంబరులో సంప్రదించాలన్నారు. పోటీలలో ప్రతిభ చూపిన వారు వచ్చేనెల 9,10తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు.

చంద్రప్రభ వాహనంపై ఊరేగిన వీరభద్రస్వామి



నారాయణవనం, జూలై 29(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువైన టీటీడీ అనుబంధ ఆలయమైన భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో ఘనంగా ప్రారంభ మయ్యాయి. మంగళవారం ఉదయం అమ్మవారితో సహా స్వామివారిని వేకువ జామున మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. వేద మంత్రాల నడుమ ప్రత్యేక పుష్పాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి వారిని వివిధ పుష్పాలతో అలంకరించి చంద్రప్రభ వాహనంపై పురువీధులలో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు పలికారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవి, ఆలయాధికారి నాగరాజు భక్తులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థిపై హత్యాయత్నం కేసులో 8 మంది నిందితుల అరెస్టు


నిందితుల అరెస్ట్ చూపిస్తున్న రూరల్ పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 29 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇరు వర్గాల మధ్య నెలకొన్న గొడవలో డిగ్రీ విద్యార్థిని కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో ఎనిమిది మందిని తిరుపతి రూరల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. గత నెల మూడో తేదీ అంబాడి సంతోష్ నాయక్‌కు, శ్రీనివాస్ యాదవ్‌కు మధ్య తాగిన మత్తులో గొడవ జరిగింది. ఆ తర్వాత సంతోష్ సోదరుడు తేజోమూర్తిని బెదిరించారు. ఈ గొడవలు పెద్దదవుతూ వచ్చాయి. ఈ నెల 23న అర్ధరాత్రి సమయంలో తిరుపతి రూరల్ పరిధిలోని బైపాస్ రోడ్డులో శ్రీనివాస్ యాదవ్, అతడి స్నేహితుడు తోహిర్ బాబా ఉండగా.. ఉప్పరపల్లికి చెందిన కాంక్రీట్ వర్కర్ లంబాడి సంతోష్‌కుమార్, అతడి సోదరుడు తోజోమూర్తి నాయక్, ఉప్పరపల్లి హరిజన వాడకు చెందిన అజయ్‌కుమార్, లంబాడి పునిత్ నాయక్, వినాయకనగర్‌కు చెందిన విద్యార్థి నితిన్‌కుమార్, గాంధీపురం ఆటో డ్రైవర్ సయ్యద్ ముస్తాఫా, అంబేడ్కర్ కాలనీకి చెందిన జంగం యశ్వంత్, పెనుమూరు హేమంత్‌కుమార్ అక్కడికి వచ్చారు. డిగ్రీ విద్యార్థి శ్రీనివాస యాదవ్‌ను కొట్టి ఆటోలో బలవంతంగా తీసుకెళ్ళి చంద్రగిరి మండలం శానంబట్ల వద్ద వెంచర్‌లో ఉంచారు. తీవ్రంగా కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ విషయం తెలిసి శ్రీనివాస యాదవ్ స్నేహితుడు మదన్, మరికొందరు అక్కడికి వెళ్లి బాధితుడిని తిరుపతికి తీసుకొచ్చి ఆసుపత్రిలో చేర్పించారు. అప్పట్లో శ్రీనివాసయాదవ్ ఫిర్యాదు మేరకు సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేశారు. డీఎస్పీ ప్రసాద్ ఆదేశాల మేరకు నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వారు వాడుతున్న మొబైల్ నెంబర్లు, కాల్‌డేటా ఆధారంగా సాంకేతిక పరమైన ఆధారాలతో కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఎనిమిది మంది నిందితులను రూరల్ పరిధిలోని ఓ అపార్టుమెంటు వద్ద పట్టుకుని అరెస్టు చేశారు. వారం రోజుల వ్యవధిలో కిడ్నాప్, హత్యాయత్నం కేసును చేధించిన సీఐ చిన్నగోవిందు, ఎస్‌ఐలు, సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన రాజు అభినందించారు.

ఎలక్ట్రిక్ బస్సులను సొంతంగా కొనుగోలు చేయండి



మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఈయూ జిల్లా కమిటీ

తిరుపతి(ఆర్టీసీ), జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ బస్సులను సొంతంగా కొనుగోలు చేయాలని, 1/2019 సర్క్యులర్‌ను అన్ని డిపోల్లో అమలు చేయాలని, ఈహెచ్‌ఎస్ కార్డు ద్వారా కాకుండా పాతపద్ధతిలో వైద్యం అందించాలని ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎండీ ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రాలు అందజేశారు. మంగళవారం తిరుపతి పర్యటనకు వచ్చిన వారిరువురిని సంస్కృత విద్యాపీఠంలో మర్యాదపూర్వకంగా కలిసి, సుదీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం వేర్వేరుగా ఇరువురికి శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి మురగమ్మ, జిల్లా అధ్యక్షుడు జి.ఆర్.చంద్ర, కార్యదర్శి మస్తాన్, ప్రచార కార్యదర్శి జె.సతీష్, వర్మ, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరబాబు, దేవరాజులు, డి.ఆర్.నాయక్, సునీల్, వాసు తదితరులు పాల్గొన్నారు.

సింగపూర్ సంస్థతో పద్మావతి వర్సిటీ ఒప్పందం



ఆనంద గోవిందలురితో వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 29 (ఆంధ్రజ్యోతి): సింగపూర్‌కు చెందిన సొసైటీ ఫర్ ఇన్నోవేషన్ ఇన్‌క్యుబేషన్ అండ్ ఎంటర్‌ప్రైనర్‌షిప్‌తో పద్మావతి మహిళా యూనివర్సిటీ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ సంస్థ ప్రతినిధి ఆనంద గోవిందలురితో పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని తదితరులు మంగళవారం సమావేశమయ్యారు. ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా మహిళా శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రైనర్స్‌ను ప్రోత్సహించే లక్ష్యం ఉన్నట్లు వారు తెలిపారు.

పీ4 ఒక విజనరీ ఆలోచన

- అర్బన్ ఆటో మ్యుటేషన్‌ను వినియోగించుకోండి
- కమిషనర్ మౌర్య



తిరుపతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చిన పీ4 ఒక విజనరీ ఆలోచన అని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అన్నారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని ఆమె ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపి వారిని బంగారు కుటుంబాలుగా మార్చడంలో పాలుపంచుకుంటున్న మార్గదర్శకులకు అభినందనలు తెలిపారు. నిజమైన అర్హులను గుర్తించి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. బంగారు కుటుంబాలకు అవసరమైన ఉద్యోగ, ఉపాధిలో భాగస్వామ్యం కావడమే ప్రధాన ఉద్దేశమన్నారు. తిరుపతిలో ఇప్పటివరకు సుమారు 7వేల కుటుంబాలను గుర్తించామని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఆగస్టు 1నుంచి అర్బన్ ఆటో మ్యుటేషన్ విధానం అందుబాటులోకి రానుందన్నారు. ఏదైనా స్థలం, ఇళ్లు కొనుగోలు చేసినవారికి రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే వారి పేరిట మ్యుటేషన్ అయిపోతుందని చెప్పారు. మ్యుటేషన్ కోసం మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదన్నారు. అయితే ఏదైనా ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన బకాయిలు మొత్తం చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్ అవుతుందన్నారు.

ఎస్వీయూ రెక్టార్ పదవి దళితులకు కేటాయించాలి



అధికారులకు విన్నవిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ రెక్టార్ పదవిని దళితులకు కేటాయించాలని వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడికి ఏపీ విద్యార్థి జేఏసీ, బీసీ విద్యార్థి సంఘం, భారతీయ దళిత సేన మంగళవారం విన్నవించింది. ఉన్నత పదవుల్లో దళితులకు ప్రాతినిధ్యం లేకపోవడం అన్యాయమని ఆ సంఘం నాయకులు హేమాద్రియాదవ్, సుధాకర్ మాదిగ, తిరుమలేష్ పేర్కొన్నారు. దీని వల్ల దళిత సామాజిక వర్గానికి యూనివర్సిటీ పాలనలో ప్రాముఖ్యత లేనట్టు భావిస్తున్నామని అన్నారు. రెక్టార్ పదవిని కూడా ఖాళీగా ఉంచడం సరికాదన్నారు. రెక్టార్ పదవిని దళితులకు కేటాయించి సామాజిక న్యాయం పాటించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'జక్కదొన'కు మొదటి బహుమతి



రచయిత కృష్ణస్వామి



జక్కదొన పుస్తక ముఖ చిత్రం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 29 (ఆంధ్రజ్యోతి): రచయిత ఆర్సీ కృష్ణస్వామి రాజు రాసిన జక్కదొన కథా సంపుటికి ఖమ్మంలోని హాసిని లిటరరీ ఫౌండేషన్ చేపట్టిన కథా సంపుటాల పోటీలో మొదటి స్థానం దక్కింది. వచ్చే నెల 17వ తేదీన ఖమ్మంలో బహుమతి ప్రదానం చేయనున్నట్టు నిర్వాహకులు తోట సుభాషిణి తెలిపారు. స్థానిక మాండలికంలో స్థానిక పరిస్థితులను 21 కథల రూపంలో ఈ పుస్తకం వెలువడింది. కృష్ణస్వామిరాజు రాసిన ఇరవై పుస్తకాల్లో జక్కదొన ఒకటి. మొదటి బహుమతికి ఎంపిక కావడం పట్ల పలువురు అభినందించారు.

ధన్వంతరి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి



మంత్రి కందుల దుర్గేష్‌కు విన్నవిస్తున్న రుద్రకోటి సదాశివం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 29 (ఆంధ్రజ్యోతి): ధన్వంతరి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం కోరారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు మంగళవారం ఆయన గుడిమల్లంలో విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

వైసీపీ నేత అరెస్టు



చైతన్య యాదవ్

తిరుపతి(నేరవిభాగం), జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మంగళం రోడ్డులో గది అద్దెకు తీసుకుని గడువు ముగిసినా అద్దె చెల్లించకుండా గది అద్దాలు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన కేసులో స్థానిక వైసీపీ నాయకుడు చైతన్య యాదవ్‌ను ఈస్ట్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ హేమాద్రి కథనం మేరకు.. చైతన్య యాదవ్ గత కొంత కాలంగా పలు ప్రాంతాల్లో రౌడీయిజానికి పాల్పడుతుండటంతో గతంలో ఈస్ట్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ క్రమంలో తిరుపతి-మంగళం రోడ్డులోని ఆరె కృష్ణకు చెందిన గదిని ఆఫీసు కోసం కొన్ని నెలల క్రితం అద్దెకు తీసుకున్నాడు. మూడు నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో గది యజమాని ఇతరులకు అద్దెకు ఇచ్చాడు. దీన్ని గమనించిన చైతన్య యాదవ్ రెండు రోజుల క్రితం ఆ గదికి వున్న గ్లాసు అద్దాలు, ఫర్నిచర్‌ను పూర్తిగా ధ్వంసం చేశాడు. జరిగిన ఘటనపై బాధితుడు కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం నిందితుడు చైతన్య యాదవ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ హేమాద్రి చెప్పారు.

వేడుకగా గరుడ పంచమి



విశేషాలంకరణలో వినాయకుడు

తిరుపతి(జీవకోన), జూలై 29(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం గరుడ పంచమిని పురస్కరించుకుని స్థానిక వినాయకసాగర్‌లో వెలసిన సంకల్ప వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి అభిషేకం నిర్వహించి, అనంతరం శోభాయమానంగా అలంకరించారు. నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శన భాగ్యంకల్పించారు. కార్యక్రమంలో పండితులు సురేష్‌స్వామి, ధర్మకర్త కొండే చెంగారెడ్డి, సభ్యులు గుండాల గోపీనాథ్, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, కృష్ణారావు, భాగ్యలక్ష్మి, కల్యాణి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వ కృషి

- రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవంలో శాప్ చైర్మన్



బ్యాడ్మింటన్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రవినాయుడు

తిరుపతి(క్రీడలు), జూలై 29 (ఆంధ్రజ్యోతి): క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని శాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో మంగవారం బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2025 పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ హాజరయ్యారు. తొలుతగా 13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన సీనియర్ మెన్ అండ్ ఉమెన్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో క్రీడా సదుపాయాల కల్పన, ఏపీ నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారుచేయాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని కొనియాడారు. క్రీడాకారులు ఈ అవకాశాలను అందిపుచ్చుకొని మరింత మెరుగ్గా రాణించాలని కోరారు. అనంతరం క్రీడాకారులతో బ్యాడ్మింటన్ ఆడి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 440మంది క్రీడాకారులు పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు మ్యాచ్‌లు కొనసాగనున్నాయి. 31న సాయంత్రం ఫైనల్ పోటీలు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో శశిధర్, చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన వ్యర్థాలు వేస్తే జరిమానా విధించండి



జూపార్క్ రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): అలిపిరి నుంచి జూ పార్కుకు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఎటువంటి వ్యర్థాలు వేయకుండా తగు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ అధికారులను కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ అధికారులతో కలసి కమిషనర్ ఈ మార్గాన్ని పరిశీలించారు. జూ పార్కు వరకు రోడ్డుకు ఇరువైపులా చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు ఉండటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ అలిపిరి నుంచి జూ పార్కు వరకు ఆహార పదార్థాల వ్యర్థాలను వేయడం వలన కుక్కలు, వన్య ప్రాణులు వస్తున్నాయని అన్నారు. చిరుత పులులు వంటివి రోడ్లపైకి రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. అలిపిరి నుంచి రోడ్డు పక్కన ఎక్కడా వ్యర్థాలు వేయకుండా సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రాత్రి సమయాల్లో ప్రత్యేకంగా సిబ్బందితో పెట్రోలింగ్ ఏర్పాటుచేసి వ్యర్థాలను వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని చెప్పారు. రోడ్డు పక్కన ఏర్పాటుచేసిన దుకాణాలను తొలగించి, పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, డీసీపీ ఖాన్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ సంజీవ్‌కుమార్

తిరుపతి(ఆటోనగర్), జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆటోడ్రైవర్లు, కార్మికులకు ప్రభుత్వం సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. తిరుపతిలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వేమన విజ్ఞానకేంద్రంలో నగర ఆటో యూనియన్ ఏడవ మహాసభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నగరంలో ఆటో స్టాండ్‌లు లేక డ్రైవర్లు రోడ్లపైనే పార్కింగ్ చేసుకొంటుండటంతో ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. అర్హులైన ఆటో డ్రైవర్లకు రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ట్రాఫిక్ సీఐ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. తిరుమలకు విచ్చేసే భక్తుల పట్ల ఆటో కార్మికులు మర్యాదగా ప్రవర్తించి తిరుపతి పుణ్యక్షేత్రానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. డ్రైవర్లకు పోలీస్ శాఖ నుంచి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని ఆయన కోరారు. స్థానిక రామతులసీ కల్యాణ మండపం నుంచి ఆటోల ర్యాలీ పురవీధుల మీదుగా టీటీడీ పరిపాలన భవనం వరకు జరిగింది. ఈ సభలో ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి టి.మురళి, కార్యదర్శి జి.వాసు, నాయకులు మునిరాజా, ప్రసాద్, రాము, హేమాద్రి, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించండి: ఎస్ఎఫ్ఐ



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పుత్తూరు బీసీ వసతిగృహం ప్రైవేటు భవనంలో ఉందని, భవన యజమాని ఖాళీ చేయమనడంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారన్నారు. పాకాల, చంద్రగిరి, సత్యవేడు, తిరుపతి తదితర వసతి గృహాల్లో సౌకర్యాలు లేక విద్యార్థులు చదువు కొనసాగించలేకపోతున్నారని చెప్పారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, కార్యదర్శి భగత్ రవి, ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

తిరుపతి(నేరవిభాగం), జూలై 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో బాలిక అదృశ్యమైన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి కథనం మేరకు... కొర్లగుంటకు చెందిన బాలిక స్థానిక గాంధీరోడ్డులో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో బాలిక సోమవారం ఉదయం కళాశాలకు వెళ్ళింది. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారిని విచారించారు. ఆమె ఆచూకీ తెలియక పోవడంతో మంగళవారం బాధితులు ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పవన్‌కల్యాణ్ సర్.. థ్యాంక్స్



హరిహరవీరమల్లు సినిమా చూసేందుకు వచ్చిన విభిన్న ప్రతిభావంతులతో కేక్ కట్ చేయిస్తున్న జనసేన నేత కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): పవన్‌కల్యాణ్ నటించిన హరిహరవీరమల్లు చిత్రం చూడాలన్న తపన చెవుడు, మూగ, అంధ లోపాలు గుర్తుకురాలేదు. సినిమా చూడాలి, వినాలన్న ఆకాంక్ష మాత్రమే వారిలో కల్గింది. వారే తిరుచానూరు రోడ్డులోని నవజీవన్ బ్లైండ్ హాస్టల్ విద్యార్థులు 140మంది. హాస్టల్ నిర్వాహకుల ద్వారా సామాజిక మాధ్యమాల్లో తమ కోరికను కోరారు. దీంతో స్పందించిన జనసేన నేత కిరణ్‌రాయల్ ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. మంగళవారం మధ్యాహ్నం షోకు సంధ్యా థియేటర్‌కు తీసుకొచ్చి 'హరిహరవీరమల్లు' చిత్రం చూపించారు. కొందరు ప్రత్యక్షంగా చూడగా మరికొందరు మనోదృష్టితో వీక్షించి ఆనందించారు. కేవలం వారికి మాత్రమే అవకాశం కల్పించడంతో సంతృప్తి చెందారు. వెలుపలకు వచ్చే సమయంలో వారు డ్యాన్స్‌లు వేస్తూ, పాటలు పాడుతూ, డైలాగ్స్ చెబుతూ, థ్యాంక్స్ పవన్‌కల్యాణ్ సర్ అంటూ వరుసక్రమంలో బస్సు ఎక్కుతుండడం చూపరులను ఆశ్చర్యపరిచింది.

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు 13 వరకు పొడిగింపు

తిరుపతి(విద్య), జూలై 29(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు చేసుకొనే గడువును వచ్చేనెల 13వ తేదీ వరకు పొడిగించినట్లు పోటీ పరీక్షల సమాచార కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికిగాను నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశాలు పొందదలచుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రవేశ పరీక్ష విధానం, దరఖాస్తులకు సంబంధించి ఇతర సమాచారం కోసం విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రాన్ని 86888 88802/93999 76999 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

త్వరలో ఖేలో ఇండియా ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు

- కేంద్రం సానుకూల స్పందన: శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), జూలై 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి శివారుప్రాంతమైన తూకివాకంలో 27ఎకరాల స్థలంలో ఖేలో ఇండియా ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయమై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కేంద్ర క్రీడాశాఖమంత్రి మన్సుఖ్ మాండవీయను కలసి చర్చించారన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలోనే ప్రాజెక్టు కార్యరూపం దాల్చనుందన్నారు. గొల్లవానిగుంట క్రీడామైదానాన్ని తొలివిడతలో రూ.3కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎస్వీయూలో ఖేలో ఇండియా ఏర్పాటుకు త్వరలో ప్రకటన వెలువడుతుందన్నారు. ఈ పథకం ద్వారా శ్రీకాళహస్తి క్రీడాప్రాంగణంలో అథ్లెటిక్ ట్రాక్, ఆర్చరీ, క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాలకు మైదానాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. చంద్రగిరిలో ఎన్టీఆర్ క్రీడా వికాసకేంద్రం పునరుద్ధరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. బంగారుపాళ్యంలో రూ.2.3కోట్లతో ఎన్టీఆర్ క్రీడా వికాసకేంద్రం ఏర్పాటుకు టెండర్ ఖరారైందన్నారు. గూడూరులోనూ రూ.2.3కోట్లతో ఈ కేంద్రం ఏర్పాటు చేయనున్నామని రవినాయుడు వివరించారు.

రాసానికి అభినందన


తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ గ్రంథాలయ పరిషత్ సభ్యుడిగా నియమితులైన డాక్టర్ వీఆర్ రాసానిని పలువురు అభినందించారు. ఓఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ వీసీ వెంకటేశ్వర్లు, తిరుమల మ్యూజియం మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగోలు కృష్ణారెడ్డి, ఆకాశవాణి తిరుపతి కేంద్రం మాజీ డైరెక్టర్ ఆకుల మల్లేశ్వరరావు, పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ తిరుపతి శాఖ కార్యదర్శి దుద్యాల చంద్రమోహన్, కొత్వాలు అమరేంద్ర, జీఎస్ ప్రసాద్ అభినందించారు. అలాగే తెలుగు యువత రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాగల ఆనందగౌడ్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ వివేక్ చౌదరి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ హరికృష్ణ యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షులు వెంకటేష్‌నాయుడు సత్కరించారు.

పులుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన



ప్రపంచ పులుల దినోత్సవం పోస్టర్‌తో జూపార్కు సిబ్బంది, విద్యార్థులు

మంగళం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఎస్వీ జూపార్కు సిబ్బంది, చంద్రగిరిలోని శ్రీచైతన్యపాఠశాల విద్యార్థులకు పులుల సంరక్షణ అవసరంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణ, పులుల జీవవైవిధ్యంపై ప్రభావం వాటి నివాస స్థలాలను కాపాడే అవసరం గురించి వివరించారు. అనంతరం విజువల్ ప్రెజెంటేషన్లు, విద్యార్థులతో పరస్పరం చర్చించారు. ఈ కార్యక్రమంలో జూపార్కు ఎడ్యుకేషన్ ఆఫీసర్ దీపక్, బయాలజిస్టులు లక్ష్మి, హారిక, ఫొటోగ్రాఫర్ వినోద్ పాల్గొన్నారు.



● నేటి సాయం సంధ్య వేళ..

మల్బరీ పంట తొలగింపు

● అధికారి తీరుతోనే అన్న రైతు



జేసీబీతో మల్బరీ పంటను తొలగించిన రైతు

తిరుపతి రూరల్,జూలై29(ఆంధ్రజ్యోతి): సరైన ప్రోత్సాహం లభించడంలేదని తిరుపతి రూరల్ మండలం వేమూరులోని రైతు అయ్యప్పనాయుడు తన ఒకటిన్నర ఎకరాలోని మల్బరీ పంటను మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. పలమనేరు పట్టు పరిశ్రమ మార్కెటింగ్ అధికారి తీరుతో విసిగి ఈ చర్యకు పాల్పడ్డానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'గతంలో పనిచేసిన అధికారి నాణ్యమైన గూళ్లను గుర్తించి మంచి ధర వచ్చేలా కొనుగోలుదారులు, రైతులను సమన్వయం చేసేవారు. ఆ స్థానంలో వచ్చిన ప్రస్తుత మార్కెటింగ్ అధికారి పట్టించుకోవడం లేదు. దీంతో పలువురు రైతులు ఇబ్బంది పడుతున్నారు. బయట ప్రాంతాల నుంచి నాణ్యమైన గూళ్లు వస్తున్నా సరైన ధరతో కొనడం లేదు. దీనికి మార్కెటింగ్ అధికారి సమన్వయలోపమే కారణం' అని వివరించారు. కాగా, గతవైసీపీ హయాంలో మల్బరీ సాగుకు ఎలాంటి ప్రోత్సాహమూ ఇవ్వలేదు. దీంతో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల్లో ఆశలు చిగురించినా, మార్కెటింగ్ అధికారి సమన్వయలోపం తమకు శాపంగా మారిందని రైతులు అంటున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.5.44 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,044

తలనీలాలు సమర్పించినవారు: 28,478

'నాసా-ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్ (నిసార్) ఉపగ్రహాన్ని జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపనున్నాం. ఇది భూఉపరితల పరిశీలన, వాతావరణం మార్పుల అధ్యయనానికి ఉపయోగపడుతుంది. కేవలం 12 రోజుల్లోనే భూగోళమంతా తిరిగే సామర్థ్యం దీనికి ఉంది. ఈ ఉపగ్రహంలో ఇస్రో ఎస్-బ్యాండ్, నాసా ఎల్-బ్యాండ్ పేలోడ్స్ అమర్చాం. ఉపగ్రహం కక్ష్యలోకి చేరిన 40 రోజుల తర్వాత సేవలు అందుబాటులోకి వస్తాయి.

- వి.నారాయణన్, ఇస్రో ఛైర్మన్

'గగనయాన్ ప్రాజెక్ట్ కోసం ఇప్పటికే పరిశోధనలు మొదలయ్యాయి. అందుకు అవసరమైన వెహికల్స్‌ను, ఆస్ట్రోనాట్ టీంను సిద్ధం చేస్తున్నాం.

- ఉన్నికృష్ణన్ నాయర్, వీఎస్ఎస్‌సీ డైరెక్టర్



చెంగాళమ్మ ఆలయంలో ఇస్రో ఛైర్మన్ నారాయణన్, పక్కనే శాస్త్రవేత్తలు ఉన్నికృష్ణన్ తదితరులు

షార్‌లో రాకెట్ ప్రయోగం

సూళ్లూరుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): షార్‌లో బుధవారం సాయంత్రం 5.40 గంటలకు రాకెట్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ ద్వారా ఇస్రో-నాసా ఉమ్మడిగా రూపొందించిన నిసార్ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనున్నారు. ఈ ప్రయోగ నేపథ్యంలో షార్‌లో సందడి వాతావరణం నెలకొంది. మన.. అమెరికా శాస్త్రవేత్తలతో పాటు ఇస్రోలోని అన్ని సెంటర్ల డైరెక్టర్లు షార్‌కు చేరుకొని ప్రయోగ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మంగళవారం మధ్యాహ్నం 2.10 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ నిర్విఘ్నంగా కొనసాగుతోంది. అన్నీ సజావుగా సాగితే నిర్దేశిత సమయంలో జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ ద్వారా నిసార్ ఉపగ్రహాన్ని రోదసిలోకి చేర్చనున్నారు. మరోవైపు భద్రతను కట్టుదిట్టం చేశారు. జల మార్గంలో కోస్టల్ గార్డులచే.. షార్ చుట్టూ పక్కల అడవుల్లో సీఐఎస్ఎఫ్ సిబ్బందితో జల్లెడ పడుతున్నారు.

దేవాలయాల్లో పూజలు

తిరుమల/సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి: జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 ప్రయోగం విజయవంతం కావాలంటూ రాకెట్ నమూనాతో మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ దర్శించుకున్నారు. శ్రీవారి పాదాల వద్ద నమూనాను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీఎస్ఎస్‌సీ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్, ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ అమిత్‌కుమార్ పాత్ర, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస గుప్తా, ఛైర్మన్ పీఎస్ యశోద, సైంటిఫిక్ సెక్రటరీ జయంతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడినీ దర్శించుకున్నారు. రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ప్రత్యేక పూజలు చేశారు. వీఎస్ఎస్‌సీ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్, ఎంఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ పాల్గొన్నారు. వీరికి ఆలయ సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మి దర్శన ఏర్పాట్లు చేశారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

'పోస్టర్ కేర్' విధానాన్ని బలోపేతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 29(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల సంరక్షణలో లేని పిల్లలకు ప్రత్యామ్నాయ రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పోస్టర్ కేర్' విధానాన్ని బలోపేతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. పోస్టర్ అడాప్షన్ గోడపత్రికలను మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ఆవిష్కరించారు. పోస్టర్ కేర్ విధానం ద్వారా పిల్లలు మానవీయ విలువలతో పెరిగే అవకాశం ఉంటుందన్నారు. సాధారణ కుటుంబ వాతావరణంలో జీవిస్తూ విద్య, ఆరోగ్య పరిరక్షణ, మానసిక సహాయ సేవలు పొందే హక్కును పొందుతారన్నారు. జిల్లా బాలల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోస్టర్‌కేర్ విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. అనర్హ తల్లిదండ్రులు, సంరక్షణలో లేని పిల్లలను గుర్తించి అర్హులైన కుటుంబాల వద్ద తాత్కాలికంగా, దీర్ఘకాలికంగా ఉంచే ప్రక్రియను చేపడతారని వివరించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఏఎస్పీ వెంకట్రావు, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, డీఈవో కుమార్, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి తదితరులు పాల్గొన్నారు.

పీ4 సర్వేను వేగవంతం చేయండి

జిల్లాలో పీ4 కార్యక్రమాన్ని వేగవంతం చేసి బంగారు కుటుంబాలను, మార్గదర్శులను గుర్తించి ఆగస్టు 4వ తేదీ నాటికి లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను రీఓపెన్‌కు తావులేకుండా గడువులోగా పరిష్కరించాలన్నారు. ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి అందించాలన్నారు. కాంట్రాక్టు, రోజువారీ కూలీలకు కనీస వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● వెంకటగిరి ఏపీఎస్పీ బెటాలియన్

అదనపు కమాండెంట్‌కు పదోన్నతి

తిరుపతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని ఏపీఎస్పీ 9వ బెటాలియన్‌లో అదనపు కమాండెంట్‌గా పనిచేస్తున్న ఎం.అరుణ్‌బోస్‌కు కమాండెంట్‌గా పదోన్నతి లభించింది. పదోన్నతిపై ఆయన్ను విశాఖలోని ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌కు కమాండెంట్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వరలక్ష్మీ వ్రతానికి రేపు టిక్కెట్లు జారీ

తిరుచానూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో ఆగస్టు 8న వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నారు.భక్తులు నేరుగా వ్రతంలో పాల్గొనేందుకు గురువారం ఉదయం 9గంటలకు ఆన్‌లైన్‌లో 150 టిక్కెట్లను అధికారులు విడుదల చేయనున్నారు. ఆలయం కౌంటర్‌లో ఆగస్టు 7న కరెంట్ బుకింగ్‌లో 150 టిక్కెట్లు విక్రయించనున్నట్లు అధికారులు తెలిపారు.

శ్రీవారిమెట్టు మార్గంలో గజ బీభత్సం

● వరి, మామిడి తోటల ధ్వంసం ● గంటన్నర ఆలస్యంగా భక్తులకు అనుమతి



దెబ్బతిన్న అరటితోట



ధ్వంసమైన వరి పంట

చంద్రగిరి, జూలై 29(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం శ్రీవారిమెట్టు మార్గంలో సోమవారం రాత్రి ఏనుగులు హల్‌చల్ చేశాయి. రాత్రి 8.30 గంటలకు 11 ఏనుగులు ఈ మార్గంలోని పంప్ హౌస్, మయూర డైరీ ఫామ్, శ్రీనివాసమంగాపురం ఎస్టీ కాలనీ, సత్యసాయి ఎస్టీ కాలనీ ప్రాంతాల్లో తిరుగుతూ భయాందోళన కలిగించాయి. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు సిబ్బందితో వెళ్లి డ్రోన్ల ద్వారా ఏనుగుల సంచారాన్ని గుర్తించారు. వీటిని శేషాచలం అడవుల్లోకి మళ్లించడానికి ప్రయత్నించారు. ఈలోగానే అవి సత్యసాయి ఎస్టీ కాలనీ సమీపంలో మేడసాని ఆనందనాయుడికి చెందిన మామిడి, అరటి చెట్లను ధ్వంసం చేశాయి. చెంచయ్య వరి పొలాన్ని తొక్కేశాయి. మంగళవారం ఉదయం 6.30 గంటలకు ఏనుగుల గుంపు శేషాచలం అటవీ ప్రాంతంలోకి వెళ్లిందని తెలిశాక రైతులు ఊపిరి పీల్చుకున్నారు. శ్రీవారిమెట్టు మార్గంలో సాధారణంగా రోజూ ఉదయం 5 గంటలకే భక్తులను అనుమతిస్తారు. ఏనుగుల సంచార సమాచారంతో 6.30 గంటలకు శ్రీనివాస మంగాపురం నుంచి శ్రీవారిమెట్టుకు బస్సుల్లో అనుమతించారు. శ్రీనివాసమంగాపురం ఎస్టీ కాలనీ, నరసింగాపురం పంచాయతీలోని సత్యసాయి ఎస్టీ కాలనీ, రామిరెడ్డిపల్లె పంచాయతీలోని వైకుంఠపురం ఎస్టీ కాలనీ, ఎ.రంగంపేట పంచాయతీలోని ఎంబీయూ విద్యాసంస్థ ప్రాంతం, రాగిమాకుల ఎస్టీ కాలనీ, దుర్గం ఎస్టీకాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగపట్ల రేంజ్ ఫారెస్ట్ అధికారులు సూచించారు. ఈ ప్రాంతాల ప్రజలతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశామన్నారు. ఏనుగుల కదలికల గురించి తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

మహిళల ఉచిత ప్రయాణంపై మెరుగైన చర్యలు తీసుకోండి

● రవాణా మంత్రి, ఆర్టీసీ ఎండీ సూచన

తిరుపతి(ఆర్టీసీ), జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమలుకు ఇప్పటి నుంచే అప్రమత్తంగా వ్యవహరిస్తూ, మెరుగైన చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు సూచించారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విద్యాపీఠంలో ఈ పథకం అమలుపై మంగళవారం జరిగిన తొలి సన్నాహక సమావేశంలో వీరు మాట్లాడారు. ఆక్యుపెన్సీరేషియో, లోడ్ పెరిగే క్రమంలో కొన్ని బస్సులు మొరాయించే అవకాశాలున్నాయన్నారు. బస్సుల సామర్థ్యం మెరుగుపరచాలని, ఫిట్‌గా ఉంటేనే గ్యారేజీ నుంచి బయటకు పంపాలని సూచించారు. విడిభాగాలను నిల్వ ఉంచుకోవాలని, మరమ్మతుల వల్ల ఆలస్యం కాకూడదన్నారు. కాలంచెల్లిన సాంకేతిక, ఇతర విడి భాగాలను తక్షణమే మార్చాలన్నారు. ఆన్‌కాల్ డ్రైవర్ల ద్వారా సిబ్బంది కొరతను అధిగమించాలని సూచించారు. కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు, ఈడీలు అప్పలరాజు, చెంగల్‌రెడ్డి, చంద్రశేఖర్, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాల డిపీటీవోలు, సీనియర్ ఆఫీసర్లు, డీఎంలు హాజరయ్యారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి, ఆర్టీసీ ఎండీ

ఇంటర్ విద్యలో నూతన సంస్కరణలు

● అవగాహన సదస్సులో ప్రిన్సిపాళ్లకు వివరించిన ఆర్ఐవో



తిరుపతి(విద్య), జూలై 29(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యావిధానంలో కొత్త సంస్కరణలపై అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు అవగాహన కల్పించారు. తిరుపతిలోని టీటీడీ ఎస్వీ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్ఐవో రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. సిలబస్ మార్పు, సబ్జెక్టుల కాంబినేషన్, ప్రశ్నపత్రంలో మార్పుల గురించి విశదీకరించారు. ఏపీఈఏపీసెట్, నీట్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధంపై వివరించారు. ఇంటర్ విద్యార్థులు ప్రధానంగా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్ఈసి గ్రూపులు తీసుకుంటున్నారన్నారు. ఈ గ్రూపు సబ్జెక్టులతో పాటు పార్ట్-1గా ఇంగ్లిష్, పార్ట్-2లో ద్వితీయ భాషగా ఏదేని ఒక సబ్జెక్టును ఎంపిక చేసుకోవచ్చని చెప్పారు. ఎంపీసీ విద్యార్థులు అదనంగా 6వ సబ్జెక్ట్‌గా బయాలజీని, బైపిసి విద్యార్థులు మ్యాథమేటిక్స్‌ను ఎంపిక చేసుకోవచ్చన్నారు. అదనపు సబ్జెక్టును ఎంపిక చేసుకున్న విద్యార్థులు ఇంజినీరింగ్, మెడికల్ ప్రవేశ పరీక్షలు ఏపీఈఏపీసెట్, నీట్ రెండింటికీ రాయవచ్చన్నారు. మ్యాథ్స్-ఎ, మ్యాథ్స్-బి సబ్జెక్టులను విలీనంచేసి మ్యాథమేటిక్స్‌గా, బోటనీ, జువాలజీ సబ్జెక్టులను విలీనంచేసి బయాలజీగా ఈఏడాది ప్రథమ సంవత్సర విద్యార్థులకు అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మార్పులు వర్తిస్తాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తమ సందేహాల నివృత్తికి కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు.

ఇంటికి తాళం కనిపిస్తే చాలు..!

● రాత్రికి దొంగతనం చేస్తాడు

● నిందితుడి అరెస్టు..

248.7 గ్రాముల బంగారు స్వాధీనం



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం),జూలై 29(ఆంధ్రజ్యోతి): ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని శ్రీకాళహస్తి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతడి నుంచి తొమ్మిది కేసులకు సంబంధించి దాదాపు రూ.27 లక్షల విలువచేసే 248.7 గ్రాముల బంగారు నగలు, మూడు మోటరు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మంగళవారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. నెల్లూరు జిల్లా జాఫర్‌సాహెబ్ కాలువకట్ట, బోడిగాడితోటకు చెందిన మీదూరి సునీల్ కొన్నేళ్లుగా చెడు వ్యసనాలకు లోనయ్యాడు. జల్సాల కోసం దొంగతనాలు మొదలు పెట్టాడు. రాత్రి పూట తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని పలుచోట్ల దొంగతనాలు చేస్తున్నాడు. గతంలో నెల్లూరు జిల్లా పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్లలో సుమారు 28 కేసులు నమోదయ్యాయి. కొన్ని చోట్ల రిమాండుకూ వెళ్లాడు. ఇతడిపై నెల్లూరు టూటౌన్ స్టేషన్‌లో డీసీ షీట్ నమోదైంది. ఆ తర్వాత శ్రీకాళహస్తి ఒకటవ, రెండవ పోలీసుస్టేషన్లతో పాటు బీఎన్ కండ్రిగ, నాయుడుపేట, గూడూరు పోలీసుస్టేషన్ల పరిధిలో దాదాపు తొమ్మిది ఇళ్లల్లో దొంగతనం చేశాడు. తాళం వేసి వున్న ఇళ్లను గమనించి రెండు, మూడు రోజులు రెక్కీ నిర్వహిస్తాడు. ఆ తర్వాత ఇంటి తాళాలు పగులకొట్టి చోరీలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో చోరీల కేసులను ఛేదించడానికి ఎస్పీ హర్షవర్ధన రాజు, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి నేతృత్వంలో వన్‌టౌన్ సీఐ గోపి, తొట్టంబేడు ఎస్ఐ రామాంజనేయులు, కానిస్టేబుళ్లు హేమాద్రి, శంకరయ్య, అరుణ్‌కుమార్, భరత్, బాలకృష్ణ, బాబు, గంగాధర్, చటర్జీలతో ప్రత్యేక బృందాలను నియమించారు. వీరు రెండు నెలలుగా ఇతడిపై నిఘా ఉంచారు. అతడి కదలికలను గుర్తుపట్టి సోమవారం నెల్లూరు పట్టణం, వెంకటేశ్వరపురం వద్ద సునీల్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి మూడు మోటరు సైకిళ్లతో పాటు దాదాపు 248.7 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు. ఈ కేసులో ప్రతిభ చూపిన సీఐ, ఎస్ఐలు, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించి, నగదు రివార్డులు అందచేశారు.

రెండు నెలల్లో 75 మంది అరెస్టు

జిల్లావ్యాప్తంగా రెండు నెలల వ్యవధిలో జరిగిన చోరీలు, ఇంటి దొంగతనాలు, కన్నపు నేరాలకు సంబంధించి 75 మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.10 కోట్ల చోరీ సొత్తు రికవరీ చేశారు. చోరీ కేసులు ఛేదించడానికి అనుభవజ్ఞులైన పోలీసు బృందాలను రంగంలోకి దింపడం, వారి పనితీరుపై ఎప్పటికప్పుడు ఫోకస్ పెట్టడంతో ఆ బృందాలు కేసులను ఛాలెంజ్‌గా తీసుకుని రికవరీ చేయడంలో విజయం సాధించారు. ఈ ఏడాది చివరి నాటికి వివిధ కేసులకు సంబంధించి 70 శాతం డిటెక్టివ్‌తో 80 శాతం రికవరీ సాధిస్తామని ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు. ఊర్లకు వెళ్లినప్పుడు ఎల్‌హెచ్ఎంఎస్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



జేఎన్‌టీయూ వీసీతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

స్కిట్ నేలను ముద్దాడుతున్న సుధీర్‌రెడ్డి

మంత్రి లోకేశ్ కృషితోనే 'స్కిట్' పునఃప్రారంభం

శ్రీకాళహస్తి, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రి నారా లోకేశ్ కృషి ఫలితంగానే స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను పునఃప్రారంభించగలిగామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం నుంచి ఎంసెట్ కౌన్సిలింగ్‌లో స్కిట్ కళాశాలకు అవకాశం కల్పించిన నేపథ్యంలో అనంతపురం జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు స్కిట్ కళాశాలకు చేరుకున్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కూటమి నేతలు కళాశాలను సందర్శించారు. ముందుగా కళాశాల ప్రాంగణం ప్రవేశద్వారం వద్ద నేలను ఎమ్మెల్యే ముద్దాడారు. స్కిట్ పునఃప్రారంభం ద్వారా తండ్రి (బొజ్జల గోపాలకృష్ణారెడ్డి) ఆశయాన్ని బతికించాడంటూ బృందమ్మ కుమారుడిని ఆలింగనం చేసుకున్నారు. కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించాక ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో విలేకరులతో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ దాష్టీకానికి స్కిట్ కళాశాల మూత ఓ నిదర్శనమన్నారు. తన తండ్రి స్థాపించిన కళాశాలను తిరిగి జేఎన్‌టీయూతో అనుసంధానం చేసి పూర్వవైభవం తీసుకొస్తానన్న హామీని నెరవేర్చడం మరచిపోలేని విషయమన్నారు. దీనికి మంత్రి నారా లోకేశ్ ఎంతగానో సహకరించారన్నారు. ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి, జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు శక్తివంచన లేకుండా శ్రమించారని అభినందించారు. రాబోయే రెండు మూడేళ్లలో గతం కన్నా రెట్టించిన స్థాయిలో స్కిట్ కళాశాలకు మంచిపేరుతో పాటు డిమాండ్ వచ్చేలా మెరుగైన ప్రమాణాలు కల్పిస్తామన్నారు. త్వరలోనే తరగతి గదులను మంత్రి లోకేశ్ చేతులమీదుగా ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి రిషితారెడ్డి, టీడీపీ నాయకులు మునిరాజానాయుడు, చెంచయ్యనాయుడు, విజయకుమార్, కంఠా రమేష్, కాసరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత ఇంజనీరింగ్ కళాశాలగా తీర్చిదిద్దుతాం

'స్కిట్‌ను అత్యున్నత విద్యాబోధనతో ఉన్నత కళాశాలగా తీర్చిదిద్దుతామని జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు భరోసా ఇచ్చారు. తామంతా స్కిట్ కళాశాల ఖ్యాతిని చూసి గతంలో ఎంతో సంతోషపడేవారమన్నారు. కొన్ని అనివార్య కారణలతో కళాశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గి, నాలుగేళ్ల క్రితం కళాశాల మూతపడిన సమయంలో తామంతా ఎంతో కలత చెందామన్నారు. అంతటి కళాశాలను రాబోయే రోజుల్లో ఉన్నత స్థాయిలో నిలబెడతామని చెప్పారు.

ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే

తిరుపతి(ఆటోనగర్), జూలై 29(ఆంధ్రజ్యోతి): తొలినుంచీ ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి వెల్లడించారు. సూళ్ళూరుపేటలో ఆగస్టు 3న జరిగే సీపీఐ 2వ మహాసభల ప్రచార గోడ పత్రికలను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. జె.విశ్వనాథ్, కె.వై.రాజా, ఎస్.శివ, నాగరాజు, పద్మనాభరెడ్డి, కాశయ్య, రత్నమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

రైల్వే గేటు మూసివేత.. వాహనదారులకు ఇక్కట్లు



పుత్తూరు,జూలై29(ఆంధ్రజ్యోతి): పుత్తూరులోని నారాయణవనం రైల్వే గేటు వద్ద మంగళవారం మరమ్మతులు చేపట్టడంతో గేటును మూసివేశారు. దీంతో పుత్తూరు నుంచి చెన్నై, నత్వేడు జాతీయ రహదారిలో వెళ్లే వాహనదారులు అవస్థలు పడ్డారు. రైల్వే రెండో లైనులో కొత్త సిమెంట్ స్లీపర్స్‌ను అమర్చుతుండడంతో గేటును మూసివేశారు. ఈ పనులు మరో రెండు రోజుల వరకు జరుగుతాయని రైల్వే అధికారులు తెలిపారు. అయితే ఈ గేటు మూసివేయడంతో పట్టణంలోకి వచ్చి వెళ్లే వాహనాలు ప్రస్తుతం కిలోమీటరు దూరంలోని మరో రైల్వే గేటును చుట్టి రావలసి వస్తోంది. ముఖ్యంగా నత్వేడు వైపు వెళ్లే వాహనాలకు దాదాపు మూడు కిలోమీటర్ల దూరం పెరుగుతోంది. నారాయణవనం గేటు దిగువ భాగంలో పలు విద్యాసంస్థలు ఉండడంతో విద్యార్థులు రెండు ఆటోలను మారవలసి వస్తోంది. మరో పక్క, ఈ గేటు మూయడంతో ఎంబీ రోడ్డులోని అండర్‌బ్రిడ్జి మీదుగా చిన్న వాహనాల రద్దీ పెరిగిపోయింది. రైల్వే సబ్వే పెరగడం, కొత్తగా పెట్టిన ఆటో సిగ్నల్ వ్యవస్థ వల్ల గేటు తెరిచే సమయం బాగా పెరగడంతో గేటుకు ఇరువైపులా వాహనాలు బారులు తీరి నిలిచి పోతున్నాయి. ప్రత్యేకించి విద్యాసంస్థలు, కార్యాలయాల సమయంలో గేట్ల వద్ద మరింత రద్దీతో ఒత్తిడి పెరిగిపోతోంది.

రూ.కోటితో 21 అభివృద్ధి పనులు

- కౌన్సిల్ ఆమోదానికి అజెండా సిద్ధం
- నేడు పుత్తూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



పుత్తూరు అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ చైర్మన్ మౌలిక ఆదేశాల మేరకు రూ.1 కోటి నిధులతో 21 అభివృద్ధి పనులు చేపట్టాలని అజెండాలో పొందుపరిచారు. బుధవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో ఈ పనులు ఆమోదించనున్నట్లు సమాచారం. బీపీఎస్, ఎల్ఆర్ఎస్ నిధులు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు సంబంధించిన 22 పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిర్వహించిన టెండర్లను కౌన్సిల్ ఆమోదానికి ఉంచారు. నీటి సరఫరా, నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, షుష్కాల రిపేరు, పారిశుధ్య వాహనాల మరమ్మతులు తదితర పనులకు నిధులు మంజూరుకు అంజెండాలో పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వేతనాలు పెరిగాయి. కేటగిరి-1, 2 కార్మికులకు రూ.3 వేలు చొప్పున, కేటగిరీ-3 కార్మికులకు రూ.3,500 పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో కౌన్సిల్ ఆమోదానికి ఉంచారు. ఈ నెల 15వ తేదీన 7 పనులకు నిర్వహించిన ఈ-టెండర్లలో మున్సిపల్ వాహనాల మరమ్మతులకు రూ.4.18 లక్షలు, హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ట్రీ గార్డ్ ఏర్పాటుకు రూ.2 లక్షలు, ఈ చెట్లకు ఎరువుల సరఫరాకు రూ.4.17 లక్షలు, తదితర వాటర్ వర్క్స్‌కు కాంట్రాక్టరు టెండర్ కోట్ చేశారు. ఈ టెండర్లను కూడా కౌన్సిల్ ముందు ఉంచనున్నారు. ద్రౌపది సమేత శ్రీ ధర్మరాజుల స్వామి వారి బ్రహ్మోత్సవాలలో రథం ప్రయాణించే మార్గంలో గుంతలుగా ఉన్న రోడ్డుకు సైడ్ మార్జిన్, ప్యాచ్‌వర్క్‌ల నిమిత్తం రూ.3.90 లక్షలు ఖర్చు చేసినట్లు అజెండాలో పొందుపరిచారు. కాగా నేటి కౌన్సిల్ సమావేశంలో ప్రస్తుత అజెండాతో పాటు గత అజెండా అంశాలపై చర్చించాలని కౌన్సిలర్లు పట్టుబట్టే అవకాశం ఉన్నట్టు సమాచారం.

ఉద్యమాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

పుత్తూరు టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఉద్యమాలు, పోరాటాల ద్వారా ప్రజా సమస్యలు పరిష్కరించడంలో సీపీఐ ముందంజలో ఉందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. మంగళవారం పుత్తూరు పట్టణంలో సీపీఐ మండల 11వ మహాసభ ఆ పార్టీ కార్యదర్శి మహేష్ అధ్యక్షతన జరిగింది. ముందుగా పుత్తూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిలుగా సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి విచ్చేసి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు పెంచాలన్నారు. పంచాయతీ, మున్సిపాలిటీలో పనిచేసే వారికి కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, రాధాకృష్ణ, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, గోపి, ముణి, శరవణ, విజయ్, సెల్వరాజాచారి, రమేష్, లావణ్య, ధనలక్ష్మి, రోజా తదితరులు పాల్గొన్నారు.

వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించండి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి వేణుగోపాలరావు

పుత్తూరు టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వేణుగోపాలరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అమరకండ్రిగ గ్రామంలో పీఎంఆర్‌కేవీవై పథకం కింద జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వారిచే రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికంగా పురుగు మందులు, కలుపు మందులు వాడితే భూమి కలుషితమైపోతుందన్నారు. సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. ఏపీఏ లక్ష్మీదేవి, పుత్తూరు మండల వ్యవసాయాధి కారి కోదండయ్య, అమరం కండ్రిగ గ్రామ వ్యవసాయ సహాయకురాలు ప్రియాంక, ఏఈవో వరప్రసాద్, రైతులు, రైతు మహిళలు పాల్గొన్నారు.

అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

పుత్తూరు అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జూన్ 30వ తేదీలోపు కొనుగోలు చేసిన అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకు అక్టోబర్ 24వ తేదీ వరకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మరిన్ని వివరాలకు టౌన్ ప్లానింగ్ విభాగాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

వైభవంగా పోలేరమ్మ పొంగళ్ల మహోత్సవం

నాయుడుపేట టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లోతువాని గుంటలో వెలసిన పోలేరమ్మ పరమేశ్వరి పొంగళ్ల మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పాలాభిషేకం చేసి, అలంకృత పోసి పూజలు చేశారు. రాత్రి స్వామి పుంగనూర్ ఉత్సవాన్ని నిర్వహించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

తడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. మండల పరిధిలోని బీవీపాళెం దళితవాడకు చెందిన విక్కేష్(29) ఇంట్లో మంగళవారం రాత్రి విద్యుత్ సరఫరా ఆగిపోయింది. సమీపంలో విద్యుత్ స్తంభానికి ఉన్న వైరును పొడవాటి కర్రతో కదిలించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతం జరగడంతో స్పృహ తప్పిపడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకటకృష్ణయ్య

ఓజిలి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం రాచపాడు గ్రామానికి చెందిన ఆళ్లకుంట వెంకటకృష్ణయ్య(55) గ్రామానికి సమీపంలోని చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. వెంకటకృష్ణయ్య ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం చెరువులో వెంకటకృష్ణయ్య మృతదేహాన్ని గమనించిన స్థానికులు బంధువులకు తెలియజేశారు. వారిచ్చిన సమాచారంతో ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.





అగ్రహారం వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు - బంగారుపేట తెలుగుగంగ కాలువ కల్వర్టు వద్ద నిల్వ చేరిన వర్షపునీరు

వెంకటగిరి - తిప్పారపాడు రోడ్డుకు గ్రహణం వీడేనా?

రాళ్లు, గుంతలతో ప్రయాణం నరకయాతన ● తరచూ ప్రమాదాలు, పట్టించుకోని పాలకులు

వెంకటగిరి టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి - తిప్పారపాడు రోడ్డుకు గ్రహణం ఎప్పుడు వీడుతుందని ప్రజలు ఎదురు చూస్తున్నారు. వెంకటగిరి నుంచి గూడూరు మండలంలోని తిప్పారపాడు వరకు 30 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులకు గత వైసీపీ ప్రభుత్వం రూ.40 కోట్లు కేటాయించింది. 2022అక్టోబరులో అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామ నారాయణ రెడ్డి శంకుస్థాపన చేశారు. పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టరు తిప్పారపాడు నుంచి బాలాయపల్లి వరకు 12 కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఇందుకోసం రూ.10 కోట్లు ఖర్చు చేశారు. బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులను ఆపేశారు. అప్పటి ఖర్చు పెట్టిన రూ.పది కోట్ల బిల్లుల కోసం కోర్టును ఆశ్రయించారు. మూడేళ్ల గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. తమ ప్రభుత్వం రాగానే రోడ్డు పనులు పూర్తి చేస్తామని కూటమి నాయకులు చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా రోడ్డు పనులు చేపట్టకపోవడంతో వాహనదారులు అవస్థలు తప్పడంలేదు. వర్షాకాలంలో ఈ రోడ్డులో ప్రయాణం నరకంగా మారుతోంది. చిన్నపాటి వర్షం వచ్చినా గోతుల్లో నీరు చేరుతున్నాయి. దీంతో ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల వెంకటగిరికి వస్తున్న ఓ ప్రైవేటు కళాశాల బస్సు యాక్సిల్ ఊడిపోయి టైరు పొలాల్లోకి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. ఈ విషయాన్ని ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తేనే, త్వరలో పూర్తి చేస్తామని వివరించారు.

అభివృద్ధితో పాటు సంక్షేమానికీ ప్రాధాన్యం: పాశం



నెల్లూరుపల్లి కొత్తపాళెం దళితవాడలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

కోట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అభివృద్ధితో పాటు సంక్షేమానికీ ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. దళిత, గిరిజనవాడల్లో ఇంటింటా ఎమ్మెల్యే తిరిగారు. సూపర్ సిక్స్‌లో భాగంగా నెరవేర్చిన హామీలు, చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలు కర్పూర హారతులు పట్టి, పూలవర్షం కురిపిస్తూ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాది కాలంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి జరిగిందని, ఇంకా కొన్ని పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని, ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరుగుతుంటే, వైసీపీ నాయకులు ఉనికి కోసం ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కాగా, టీడీపీ నాయకుడు కట్టా శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరుపల్లి, కొత్తపాళెం, వీసీ అగ్రహారం గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి బాలకృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, చిట్టకూరు దశరథరామిరెడ్డి, జలీల్ అహ్మద్, మధుసూదన్, తిరుమల శెట్టి కోటేశ్వరరావు, ఎంపీటీసీలు నారాయణ, సురేష్, మంచుపీర తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి: విజయశ్రీ



గోపాల్ రెడ్డిపాళెం ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోపాల్ రెడ్డిపాళెం, గొల్లలమూలపు గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ గ్రామాల్లో అభివృద్ధి పనులను చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధిని గాలికొదిలేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా అర్హులై ఉండి పింఛన్లు, సంక్షేమ పథకాలు అందనివారు తెలుసుకునేందుకు ప్రజల ముందుకు వచ్చామన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అంతకుముందు గొల్లలమూలపులో యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీంద్రనాథరెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పు శంకరయ్య, కార్యదర్శి పాకం వెంకటసుబ్బయ్య, నాయకులు మురళీరెడ్డి, వర్లతరెడ్డి, చంద్రారెడ్డి, పోతయ్య, సతీష్, నారాయణరెడ్డి, సుబ్రహ్మణ్యం, తిరుపాల్, వంకా రమేష్, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో నాయుడుపేట క్రీడాకారుల ప్రతిభ



నాయుడుపేట క్రీడాకారులు కోచ్ పవన్‌కుమార్

నాయుడుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ తైక్వాండో చాంపియన్ షిప్‌ను నాయుడుపేట క్రీడాకారులు కైవసం చేసుకున్నట్లు తైక్వాండో క్లబ్ ఫౌండర్, కోచ్ పవన్‌కుమార్ తెలిపారు. దేశవ్యాప్తంగా 1500 మంది క్రీడాకారులు తైక్వాండో పోటీల హాజరయ్యారు, నాయుడుపేట నుంచి 65 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో విన్నర్స్ విభాగం నుంచి 35 మంది, రెగ్యులర్ విభాగం నుంచి 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కొరికి, పుమ్సే విభాగాల్లో ప్రతిభ కనబర్చి ప్రథమంగా 49 పతకాలను సాధించారు. కొరికి విభాగంలో 12 బంగారు, 14 వెండి, 22 కాంస్య పతకాలు, పుమ్సే విభాగంలో 14 బంగారు, 3 వెండి, ఒక కాంస్య పతకాలను సాధించారు. వ్యక్తిగత సబ్ జూనియర్ విభాగంలో ఎ.మహేశ బెస్ట్ ఫైటర్గా, జూనియర్ విభాగం కొరికి, పుమ్సేలో వి.దివిజ 4 బంగారు పతకాలను సాధించింది వీరంతా కృష్ణా జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు. కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

బల్లవోలులో దారి సమస్య పరిష్కారం

చిల్లకూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లవోలు గ్రామంలో దారి సమస్యను రెవెన్యూ అధికారులు మంగళవారం పరిష్కరించారు. గత ప్రభుత్వంలో కొందరు వైసీపీ నాయకులు గ్రామంలోని ఓ వీధిలోని దారిని ఆక్రమించుకుని నడిచేందుకు వీలు లేకుండా అడ్డంగా మట్టిపోశారు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ దృష్టికి తీసుకువెళ్లడంతో వారు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. మంగళవారం అధికారులు ఆక్రమణలను తొలగించి స్థానికులు నడిచేందుకు మట్టి రోడ్డును ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, తానంకి నానాజీ, తహసీల్దార్ శ్రీనివాసులుకు టీడీపీ నేతలు వినయ్ కుమార్‌రెడ్డి, పద్మజ, శేఖర్‌బాబు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

జింక మృతి

దొరవారిసత్రం, జూలై 29(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం పూలతోట ఆర్అండ్‌బీ రోడ్డులో సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో జింక మృతి చెందింది. స్థానికులు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

సీపీఐ కార్యవర్గం ఎన్నిక

వెంకటగిరి టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గ సీపీఐ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పీఎల్ కృష్ణ, కార్యదర్శిగా కె.జాన్, సభ్యులుగా డి.కిషన్‌కుమార్, కరిపల్లి అంకయ్య, నరసింహులు, మునీంద్ర, బాలసుబ్రహ్మణ్యం, కుప్పయ్య, బలరామనాయుడు, వెంకటయ్య, నక్కా దామోదరం, మునికృష్ణారెడ్డి, బాలాజీ, చంద్రారెడ్డి, నగేశ్వరరావు, హేమచంద్ర, వరుణ్‌కుమార్, మావయ్య సాయి, రమణయ్య ఎన్నుకున్నారు.

జయంపులో ఉచిత కంటి వైద్య శిబిరం

బాలాయపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జయంపులో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. పెళ్లకూరుకు చెందిన దాగాల లలితమ్మ, బాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతిలోని వెంకటేశ్వర అరవింద్ ఆస్పత్రి సహకారంతో 185 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 65మంది రోగులకు ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. 50 మందికి ఉచిత ఆపరేషన్లు చేస్తున్నట్లు ట్రస్టు మేనేజర్ గోకులకర్, ఆవో సీతారామనాయుడు తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయం ఖాళీ

తడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తడ ఎంపీడీవో కార్యాలయం అధికారులు లేక ఖాళీ అయ్యింది. ఎంపీడీవో శేఖర్‌నాయక్ బాపట్లలో జరిగే నెల రోజుల శిక్షణ కార్యక్రమానికి వెళ్లారు. ఏవో పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉంది. ఈవోపీఆర్డీ ఆనారోగ్య సమస్యలతో 2 నెలలుగా సెలవులో ఉన్నారు. కార్యాలయంలో అధికారులు లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఉసూరుమంటూ వెనుదిరిగి వెళ్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇన్‌చార్జిలను నియమించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ ఉద్యోగాలు

నాయుడుపేట టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీలో ఎలక్ట్రికల్ విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకాలు చేపడుతున్నట్లు కమిషనర్ ఫజులుల్లా మంగళవారం తెలిపారు. ఐటీఐ పూర్తిచేసి, వర్క్స్ అనుభవం కలిగిన వారు అర్హులన్నారు. నెలకు రూ.12వేల వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆగస్టు 5వ తేదీలోగా మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

బాలిక అదృశ్యం

సూళ్లూరుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం వెంగళాపురం గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలిక అదృశ్యమైనట్టు తండ్రి మునిరెడ్డి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం పాఠశాలకు వెళ్లిన బాలిక సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదని, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లేదన్నారు.

మోక్షధామం సుందరీకరణ

గూడూరు అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణంలోని రోటరీ మోక్షధామంలో రూ.లక్షలతో సుందరీకరణ పనులను పూర్తి చేశారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ మోక్షధామం సుందరీకరణకు చేయూత నిచ్చిన సంయుక్త సేవాసమితి సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం సంయుక్త సేవాసమితి అధ్యక్షుడు అశోక్‌కుమార్, రోటరీక్లబ్ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో మోక్షధామం చైర్మన్ కిరణ్ చక్రవర్తి, సభ్యులు దయాకర్‌రెడ్డి, హనుమంతరావు, పీవీ కృష్ణయ్య, రవీంద్రరెడ్డి, బాలకృష్ణ, సురేష్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, రాంప్రసాద్, జీజీ నాయుడు, జనార్దన్‌రెడ్డి, రఘురాంరెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సరఫరా, లీకేజీపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్, పక్కన జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి రమణయ్య

ఓజిలి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్‌రోడ్డుకు సమీపంలో ఉన్న ఏజీ అండ్ పీ గ్యాస్ ప్లాంట్ వద్ద మంగళవారం జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి రమణయ్య ఆధ్వర్యంలో గ్యాస్ సరఫరా, లీకేజీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏజీ అండ్ పీ గ్యాస్ రీజనల్ హెడ్ అనిల్‌కుమార్ గ్యాస్ లీకేజీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రవాణా సమయంలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. అలాగే అగ్నిమాపక అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో నాయుడుపేట అగ్నిమాపక అధికారి సునీల్ కుమార్, ట్రాన్స్‌కో సబ్ ఇంజనీర్ మునిబాబు, వీఆర్వో వెంకటేశ్వర్లురాజు, పోలీసు సిబ్బంది, ఏజీఅండ్‌పీ గ్యాస్ ఆపరేషన్స్ మేనేజర్ సాగర్ బిస్వాస్, సేఫ్టీ మేనేజర్ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత విధానంపై అవగాహన



చేనేత సమస్యలు తెలుసుకుంటున్న ఎన్ఐఎఫ్‌టీ విద్యార్థులు

వెంకటగిరి టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి చేనేత విధానంపై హైదరాబాద్‌కు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎన్ఐఎఫ్‌టీ) విద్యార్థులకు అవగాహన కల్పించారు. విజయవాడలోని విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్(వీవీసీఎఫ్) సహకారంతో గైడ్ కేకే బాబు ఆధ్వర్యంలో ఎన్ఐఎఫ్‌టీ విద్యార్థులు వెంకటగిరిలోని బంగారుపేటలో పర్యటించి చీరల నేత విధానం, ప్రాముఖ్యం, మార్కెటింగ్ తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మస్తాన్ బాబు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత కూన మల్లికార్జున్, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నై - సూళ్లూరుపేట మధ్య రేపు 14 సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ - గూడూరు సెక్షన్‌లో గుమ్మిడిపూండి - పొన్నేరి రైల్వే మార్గంలో మరమ్మతుల కారణంగా గురువారం చెన్నై సెంట్రల్ - సూళ్లూరుపేట మధ్య 14 రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, చెన్నై సెంట్రల్ నుంచి ఉదయం 8.50, 9, 9.30, 10.30, 11.35 గంటలకు గుమ్మిడిపూండికి వెళ్లే సబర్బన్ రైళ్లు, గుమ్మిడిపూండి నుంచి ఉదయం 9.10, 9.55, 11.25, మధ్యాహ్నం 12, ఒంటి గంటలకు చెన్నై సెంట్రల్‌కు వెళ్లే సబర్బన్ రైళ్లను రద్దు చేశారు. సెంట్రల్ నుంచి ఉదయం 10.15 గంటలకు సూళ్లూరుపేట వెళ్లే మెము రైలు, సూళ్లూరుపేట నుంచి ఉదయం 10 గంటలకు చెన్నై సెంట్రల్‌కు వెళ్లే మెము రైళ్లు రద్దు చేశారు. అలాగే, చెన్నై బీచ్ నుంచి ఉదయం 9.40 గంటలకు గుమ్మిడిపూండి, గుమ్మిడిపూండి నుంచి ఉదయం 10.40 గంటలకు చెన్నై బీచ్‌కు వెళ్లే సబర్బన్ రైళ్లు రద్దు చేశారు.

ప్రత్యేక రైళ్లు

ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై సెంట్రల్ నుంచి పొన్నేరికి ఉదయం 8.50, 9, 9.30 గంటలు, పొన్నేరి నుంచి సెంట్రల్‌కు ఉదయం 9.27, 10.23 గంటలకు, పొన్నేరి నుంచి చెన్నై బీచ్‌కు ఉదయం 11.13, చెన్నై బీచ్ నుంచి మీంజూరుకు ఉదయం 9.40, చెన్నై సెంట్రల్ నుంచి ఎణ్నూర్‌కు ఉదయం 10.30, ఎణ్నూర్ నుంచి చెన్నై సెంట్రల్‌కు మధ్యాహ్నం 12.43, చెన్నై సెంట్రల్ నుంచి మీంజూరుకు ఉదయం 11.35, మధ్యాహ్నం 1.31, సూళ్లూరుపేట నుంచి చెన్నై సెంట్రల్‌కు మధ్యాహ్నం 12.20 గంటలకు ప్రత్యేక సబర్బన్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

వాకాడు ఏఎంసీకి ముగ్గురు డైరెక్టర్ల నియామకం



మారంరెడ్డి జనార్దనరెడ్డి, దొడ్డగ వెంకటరమణయ్య, చల్లా స్వాతి

చిట్టమూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): వాకాడు మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా చిట్టమూరు మండలం నుంచి ముగ్గురు టీడీపీ నాయకులకు చోటు దక్కింది. పార్టీ వ్యవహారాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న మన్నెమాల గ్రామానికి చెందిన మారంరెడ్డి జనార్దనరెడ్డి, ఆరూరుకు చెందిన దొడ్డగ వెంకటరమణ, గునపాడుకు చెందిన చల్లా స్వాతిలను ఏఎంసీ డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అక్రమ లేఅవుట్లలోని ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించుకోండి

నాయుడుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతిలేని లేఅవుట్లలోని ఇంటి స్థలాలను కొన్నవారు క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అనధికార లేఅవుట్లలో కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించుకోవడానికి 2025 జూన్ 30 వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.

ముక్కంటి సేవలో ఇస్రో చైర్మన్



ఇస్రో చైర్మన్ నారాయణకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, జూలై 29(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వస్వామిని మంగళవారం ఇస్రో చైర్మన్ నారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. బుధవారం నాసా, ఇస్రో సంయుక్తంగా ప్రయోగించే నిసార్ శాటిలైట్ ఉపగ్రహం ప్రయోగం విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మృత్యుంజస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక అందజేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

ఏర్పేడు, జూలై 29(ఆంధ్రజ్యోతి): బ్యాంకు పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. ఏర్పేడులో ఉన్న ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, సప్తగిరి బ్యాంకులను మంగళవారం ఆయన సందర్శించి బ్యాంకు మేనేజర్లతో మాట్లాడారు. సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంకుల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించండి

రేణిగుంట జూలై 29(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించారని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం సాయంత్రం రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పేడు, రేణిగుంట మండలాల్లోని వివిధ బ్యాంకుల మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. బ్యాంకుల వద్ద సెక్యూరిటీ మేనేజ్మెంట్, సీసీ కెమెరాలు, అలారం, నైట్ సెక్యూరిటీపై పలు సూచనలు చేశారు. ఏర్పేడు, రేణిగుంట సీఐలు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లికి పొంగళ్లు

రేణిగుంట జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సంత గేటు వద్ద ఎల్లమ్మ తల్లి ఆలయ జాతరం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు మంగళవారం పొంగళ్లు సమర్పించారు. ఉదయం ఎల్లమ్మతల్లికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ నిర్వాహకుడు ఏలుమలై రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. రాత్రి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

పాఠశాలకు వాల్‌చార్టులు పంపిణీ



పాఠశాలకు చార్టులను అందజేస్తున్న డాక్టర్‌బత్తెయ్యనాయుడు తదితరులు

శ్రీకాళహస్తి, జూలై 29(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని 16వ వార్డులో ఉన్న మున్సిపల్ ప్రాథమి కోన్నత పాఠశాలకు ప్రియాంకగాంధీ సంఘ టన్ స్టేట్ ప్రెసిడెంట్ షేక్ కరీముల్లా వాల్ చార్టులను మంగళవారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ బత్తెయ్యానాయుడు వాటిని పాఠశాల సూపర్‌వైజరు చంద్రశేఖర్ యాదవ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షేక్ కరీముల్లా, సయ్యద్ జిలానీ, నాగూరయ్య, శివయ్య, షేక్‌నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో మంత్రి కందుల దుర్గేష్



శ్రీకాళహస్తి, జూలై 29(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం మంత్రి కందుల దుర్గేష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు, జనసేన నాయకులు కొట్టేసాయి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంకాలమ్మ తిరునాళ్లు



నారాయణవనం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోవిందప్పనాయుడు కండ్రిగలో కొలువైన గ్రామ దేవత అంకాలమ్మ తిరునాళ్లను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి వేపాకు తోరణాలు, మాలధారణతో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి భక్తులు అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పొంగళ్లు సమర్పించారు. రాత్రి కోలాటాలు, మంగళ వాయిద్యాలు నడుమ పుర వీధులలో అమ్మవారిని ఘనంగా ఊరేగించారు.

ఘనంగా సహస్ర కలశాభిషేకం

నారాయణవనం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలో కొలువైన సొరకాయల స్వామి ఆలయంలో 123వ గురుపూజోత్సవాల్లో భాగంగా మంగళవారం సహస్ర కలశాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా సొరకాయలస్వామి వారికి పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం తదితర ద్రవ్యాలతో అభిషేకం చేశారు. విశేష హోమం నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం 1008 కలశాలతో సహస్ర కలశాభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

స్వామివారి సేవలో ఎమ్మెల్యే ఆదిమూలం

గురుపూజోత్సవంలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు స్వామివారి తీర్థ ప్రసా దాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు

సత్యవేడు, జూలై 29(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని శ్రీసిటీ సీఐ బీవీ.శ్రీనివాసులు పేర్కొన్నారు. శ్రీసిటీలోని డైకిన్ పరిశ్రమలో మంగళవారం డ్రగ్స్ , సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జయరాం, నాయక్, మహిళా శిశు సంక్షేమ అధికారి ఈశ్వరి, డైకిన్ కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

రెగ్యులైజేషన్‌కు మరో అవకాశం

శ్రీకాళహస్తి, జూలై 29(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లను రెగ్యులైజేషన్ చేసుకోవడానికి మరో అవకాశం ఇస్తున్నట్లు పురపాలక సంఘ కమిషనర్ సంజీవకుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అక్టోబరు 24లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు పురపాలక సంఘం వెబ్‌సైట్ లేదా టౌన్‌ప్లానింగ్ అధికారులను సంప్రదించాలని కోరారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన

ఏర్పేడు, జూలై 29(ఆంధ్రజ్యోతి): పాపానాయుడుపేట జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రగతిసంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా వల్ల జరుగుతున్న నష్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రగతి సంస్థ మండల కో-ఆర్డినేటర్ సుభాష్, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ నారాయణ మాట్లాడుతూ అవయవాల దోపిడీ జరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ మంజూష, ప్రగతి సంస్థ కార్యకర్త సుమలత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మా పాఠశాలలను విలీనం చేయొద్దు



డీవైఈవోకు వినతిపత్రం ఇస్తున్న విలీన పాఠశాల గ్రామాల ప్రజలు

కేవీబీపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలలను విలీనం చేయవద్దని స్థానిక పాతపాళెం, జ్ఞానమ్మకండ్రిగ, బంగారమ్మకండ్రిగ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, సీపీఐ దాసరి జనార్దన్ ఆధ్వర్యంలో డీవైఈవో మహేశ్వర్‌ను కోరారు. మంగళవారం ఆయన మండలానికి విచ్చేయడంతో సమస్య పరిష్కరించాలని విన్నవించారు.

పరశురామేశ్వరుడి సేవలో మంత్రి దుర్గేష్

ఏర్పేడు, జూలై 29(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వరాలయాన్ని మంగళవారం మంత్రి కందుల దుర్గేష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద వేదపండితులు యోగేంద్రశర్మ, వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు, అర్చకులు పవన్‌కుమార్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆగస్టు 4, 5 తేదీలో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య పిలుపునిచ్చారు. మండలంలోని కారణిమిట్ట గ్రామంలో జిల్లా మహాసభల పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరాస్వామి, రమణయ్య, చొక్కలింగం, సుబ్రమణ్యం, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకూడదు: సీఐ

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై వాహనాలను అడ్డదిడ్డంగా నిలపడం వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని ఇకపై అలా నిలిపితే చర్యలు తప్పవని సీఐ తిమ్మయ్య హెచ్చరించారు. మంగళవారం మెయిన్ రోడ్డుపై ఉన్న వాహనదారులకు, ఆటోవాలాలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ విశ్వనాథనాయుడు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ట్రైనీ ఎస్ఐగా సుధీర్‌రెడ్డి



బుచ్చినాయుడు కండ్రిగ, జూలై 29 (ఆంధ్ర జ్యోతి): స్థానిక పోలీసుస్టేషన్‌లో ట్రైనీ ఎస్ఐగా సుధీర్‌రెడ్డి విధులను నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. మూడు నెలలు పాటు వివిధ అంశాలపై శిక్షణ పొందుతారని తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

శ్రీకాళహస్తి, జూలై 29(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలంలో పలు విద్యారంగ సమస్యలపై ఎంఈవోను కలిసి మంగళవారం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో త్వరలోనే సమన్వయ సమావేశం ఏర్పాటు చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయప్రకాష్, చంద్రశేఖర్, శ్రీకాళహస్తి డివిజన్ కన్వీనర్ సుధాకర్, దేవేంద్ర, అబ్బులు, మోతిలాల్, బత్తెయ్య, రాంబాబు, బట్టాప్రసాద్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ‘దేవుడిబాట’ అభివృద్ధి పనులు



దేవుని బాటలో జరుగుతున్న పనులు



శ్రీకాళహస్తి, జూలై 29(ఆంధ్రజ్యోతి): దేవుని బాట (కైలాసగిరి ప్రదక్షిణ) అబివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముక్కంటి ఆలయ అధికారులు శరవేగంగా అభివృద్ధి చేస్తున్నారు. శ్రీకాళహస్తిలో నిర్వహించే కైలాస గిరిప్రదక్షిణకు ఎంతో విశిష్టత ఉంది. ప్రతి ఏటా కనుమ పండుగ రోజున మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా జరిగే ఆదిదంపతుల కల్యాణ వేడుకకు సకల దేవతాగణాలు, రుషులు, మునులను ఆహ్వా నించేందుకు పార్వతీ పరమేశ్వర్లు కైలాస గిరిప్రదక్షిణగా ఊరేగుతుంటారు. కల్యాణ మహోత్సవం అనంతరం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులు తిరిగి కైలాగా గిరి ప్రదక్షిణగా సాగుతూ దైవగణాలకు వీడ్కోలు పలుకుతుంటారు. కైలాస పర్వతాలు ప్రత్యక్ష దైవస్వరూపంగా భక్తులు ఆరాధిస్తారు. స్వామి, అమ్మవార్ల కైలాసగిరి ప్రదక్షిణ సమయంలో సుమారు 50వేలకు మందికి పైగా భక్తులు పోటెత్తుతారు. దశాబ్దకాలంగా కైలాసగిరి ప్రదక్షిణ చేసే భక్తులు అంతంతకూ పెరుగుతున్నారు.

నాడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శ్రద్ధతో..

వందల సంవత్సరాల క్రితం ఉన్న దేవుని బాట అడవిలో కలిసిపోయింది. 2017లో అప్పటి టీడీపీ పాలనలో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి దేవుని బాటపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు దేవుడి బాటను గుర్తించారు. ఆ మార్గంలో పురాతన విడిది మండపాలు, వినాయక ఆలయాలను గుర్తించి అన్నింటిని కలుపుతూ కైలాసగిరి రిజర్వాయర్ వద్ద ఉన్న అంజూరు మండపం వరకు అక్కడ నుంచి వెయ్యిలింగాల కోన వరకు విస్తారమైన గ్రావెల్ రోడ్డును ఏర్పాటు చేశారు. దీంతో ప్రతి మాసంలోని పౌర్ణమి తిథిలో స్థానిక శివభక్తులు కాలినడకన, వాహనాల్లో గిరిప్రదక్షిణ చేసేవారు పెరుగుతూ వచ్చారు. ఆ తరువాత 2023లో వైసీపీ ప్రభుత్వం పట్టణ శివారులోని రాజీవ్‌నగర్ నుంచి అంజూరు మండపం వరకు సిమెంటు రోడ్డును ఏర్పాటు చేసింది. వేయి లింగాల కోన నుంచి ముక్కంటి ఆలయ సమీపంలో తుఫాన్‌సెంటర్ వరకు గ్రావెల్‌రోడ్డును ఏర్పాటు చేసింది.

నేడు సుధీర్‌రెడ్డి చొరవతో..

మొత్తం 18కిలోమీటర్ల పొడవు ఉన్న గిరిప్రదక్షిణ రోడ్డును పూర్తిగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఇటీవల దృష్టిసారించారు. ఇందులో భాగంగా వేయి లింగాల కోన నుంచి ముక్కంటి ఆలయ సమీపంలోని కోనేటిమిట్ట వద్ద ఉన్న ఎదురుసేవ మండపం వరకు 7కిలోమీటర్ల మేర సీసీరోడ్డుకు ప్రతిపాదన చేశారు. ఆ మేరకు ఆలయ అధికారులు టెండర్లు పిలిచి రెండు రోజుల క్రితం పనులు ప్రారంభించారు. ఈ రోడ్డు పూర్తయితే గిరి ప్రదక్షిణ మార్గం మొత్తం సిమెంటు రోడ్డు రావడంతో పాటు ఆహ్లాదకరంగా సుందరీకరణ కానుంది. తిరుమలలో పౌర్ణమి గరుడసేవ తరహాలో స్వామి అమ్మవార్ల గిరిప్రదక్షిణ ప్రతినెలా నిర్వహిస్తే వేలాది మంది భక్తులు విచ్చేసే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి ప్రతి నెలా గిరిప్రదక్షిణ కోసం వేలాదిమంది తమిళనాడకు వెళుతుండడాన్ని గుర్తు చేస్తున్నారు.

బ్రాహ్మణపల్లి శ్మశానానికి కొత్త రోడ్డు ఏర్పాటు



కేవీబీపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామం ఏర్పడి 70 సంవత్సరాలు కావస్తోంది. ఆ గ్రామంలోని శ్మశానానికి వెళ్లే దారి ఉండేది కాదు. మృతదేహాలను తీసుకెళ్లేందుకు ఎన్నో ఇబ్బందులు పడేవారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను గ్రామస్థులు కలిసి తమ గ్రామ గోడును వినిపించారు. ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీచేశారు. స్పందించిన కలెక్టర్ రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి యుద్ధప్రాతిపదికన శ్మశానానికి రోడ్డు ఏర్పాటు చేశారు. సదరు రోడ్డును సీసీ రోడ్డుగా మార్పు చేయించి అక్కడ ఒక బోరును ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరుతున్నారు.

చెత్త సేకరణ బండ్లు ప్రారంభం



చెత్త సేకరణ తోపుడుబండ్లకు పూజలు చేసి ప్రారంభిస్తున్న రిషితా రెడ్డి

రేణిగుంట జూలై 29 (ఆంధ్రజ్యోతి): రూ.6లక్షలు వెచ్చిన కొనుగోలు చేసిన చెత్త సేకరణ తోపుడు బండ్లను ఎమ్మెల్యే సతీమణి రిషితా రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పట్టణంలోని కొన్ని వీధుల్లోకి చెత్త టాక్టర్లు వెళ్లలేని పరిస్థితులు ఉండడంతో తోపుడుబండ్లు కొనుగోలు చేశామన్నారు. ప్రజలు చెత్తను రోడ్లలో వెయ్యకుండా పంచాయతీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బీసీ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగేశం, కార్యదర్శి మాధవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ నాయకులు పుష్పనాథం, కన్నన్ రెడ్డి, కొరియర్ రవి, రమణ, రాజేష్ రెడ్డి, మేరీ, బాబు, సుబ్రహ్మణ్యం, నవాబ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఉదయం నూతన తోపుడు బండ్లను జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి పరిశీలించారు.

బంగారు కుటుంబాలను గుర్తించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ జరీనా

వడమాలపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): పీ-4లో బంగారు కుటుంబాల ఎంపికను సామాజిక స్పృహతో ఎంపిక చేయాలని తహసీల్దార్ జరీనా చెప్పారు. వీఆర్వోలతో మాట్లాడుతూ మండలంలో గ్రామాల వారీగా నిరుపేద కుటుంబాలను పీ- 4 కుటుంబాలుగా ఎంపిక చేసి వారిని ఉన్నత స్థితికి తీసుకువచ్చేలా దత్తత తీసుకొనేలా దాతలను గుర్తించాలని సూచించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదు



ఏర్పేడు, జూలై 29(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లోమద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. ఏర్పేడులో మద్యం సేవిస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళలను ఇబ్బందులకు గురిచేస్తే సహించబోమని పేర్కొన్నారు.

మహాకుంభాభిషేకం నిర్వహించండి

శ్రీకాళహస్తి, జూలై 29(ఆంధ్రజ్యోతి): భక్తకన్నప్ప కొండపై ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి మహాకుంభాభిషేకం నిర్వహించాలని పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన ఆలయాన్ని సందర్శించారు.

శాస్త్రోక్తంగా నాగపంచమి

వడమాలపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయంలో నాగదేవతలకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. శ్రావణమాసం శుక్లపక్షంలో వచ్చే పంచమి రోజున నాగ దేవతలకు భక్తులు పాలాభిషేకం చేశారు. కాలసర్ప దోష నివారణ కోసం భక్తులు పూజలు చేశారు. అర్చకులు శివ, సాయిశర్మ ఆధ్వర్యంలో మంగళ హారతులిచ్చారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం : ఆదిమూలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మంగళవారం మహిళా మండలి సమాఖ్య కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. స్త్రీనిధి పథకం ద్వారా ఎంపికైన స్వయం సహాయక సంఘాల మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుమన్ కుమార్, అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

రేణిగుంట జూలై 29 (ఆంధ్రజ్యోతి): గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు పోలీసులు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని ఆర్ మల్లవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు పోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలు, ఈవ్ టీజింగ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్ఐ అరుణ్‌కుమార్, ట్రైనింగ్ ఎస్ఐ స్వాతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రప్రభ వాహనంపై ఊరేగిన వీరభద్రస్వామి



నారాయణవనం, జూలై 29(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువైన టీటీడీ అనుబంధ ఆలయమైన భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో ఘనంగా ప్రారంభ మయ్యాయి. మంగళవారం ఉదయం అమ్మవారితో సహా స్వామివారిని వేకువ జామున మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. వేద మంత్రాల నడుమ ప్రత్యేక పుష్పాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి వారిని వివిధ పుష్పాలతో అలంకరించి చంద్రప్రభ వాహనంపై పురవీధులలో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు పలికారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవి, ఆలయాధికారి నాగరాజు భక్తులు పాల్గొన్నారు.